ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

బుధవారం 8 అక్టోబరు 2025

వ్యవసాయ రంగంలో డ్రోన్లు



పురుగు మందులు, ద్రవ ఎరువుల పిచికారీకి వినియోగం

- ఎకరా విస్తీర్ణంలో పది నిమిషాల్లో పని పూర్తి
- ప్రతి మొక్కకూ సమానంగా మందు
- సమయంతోపాటు కూలి ఖర్చులు ఆదా
- డ్రోన్ ఖరీదుపై 40 శాతం రాయితీ ఇస్తున్న ప్రభుత్వం

- 8లో

భారీ వర్షం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కుండపోతగా వాన

- నీట మునిగిన అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్
- చోడవరంలో వాగులను తలపించిన వీధులు
- 'పేట'లో పలు కాలనీలు జలమయం
- ఆర్.భీమవరంలో పిడుగుపడి ఆవు మృతి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నీట మునిగింది. ప్రయాణికులు బస్సుల కోసం వేచివుండే ప్రాంతంలోకి నీరు చొచ్చుకువచ్చింది. చోడవరంలో పలు వీధులు వర్షం నీటితో వాగులను తలపించాయి. పాయకరావుపేటలో లోతట్టు కాలనీలు నీటమునిగాయి.



నీట మునిగిన అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం మధ్యాహ్నం మూడు గంటలు తరువాత ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన పడింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద నీరు అధికంగా నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సబ్‌వేల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ద్విచక్ర వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్



చోడవరంలో వాగును తలపిస్తున్న చీడికాడ రోడ్డు



పాయకరావుపేట ప్రశాంతినగర్‌లో నీట మునిగిన రహదారి

మరోసారి మునిగిపోయింది. బస్సులు ఆగే ప్లాట్‌ఫారం ముంపునకు గురైంది. ప్రయాణికులు వేచి వుండే ప్రదేశంలోని వర్షం నీరు చొచ్చుకు వచ్చింది.

చోడవరంలో వాగుల్లా మారిన రోడ్లు

చోడవరం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒంటి గంట తరువాత ఉరుములు మెరుపులతో సుమారు రెండు గంటలపాటు కుండపోతగా కురిసిన వర్షానికి పట్టణంలోని బాలాజీనగర్, బానయ్యకోనేరు, చీడికాడ రోడ్డుతోపాటు పలు ప్రాంతాలు నీటమునిగాయి. వర్షం నీటితో పలు రహదారులు వాగులను తలపించాయి. ఈదురుగాలులు... మిగతా 8వ పేజీలో

కోనాంకు జలకళ

రిజర్వాయర్‌కు 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు
- 100 మీటర్లు దాటడంతో అధికారులు అప్రమత్తం
- 400 క్యూసెక్కులు దిగువకు విడుదల

చీడికాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం జలాశయం పూర్తిగా నిండింది. పరీవాహక ప్రాంతంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రిజర్వాయర్‌లోకి 600 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లుకాగా, మంగళవారం సాయంత్రం 100 మీటర్లకు చేరింది. వరద ప్రవాహం కొనసాగు తుండడంతో ప్రాజెక్టు అధికారులు ముందుజాగ్రత్త చర్యగా స్పిల్‌వే గేట్లను ఎత్తి 400 క్యూసెక్కుల నీటిని బొడ్డేరు నదిలోకి విడిచిపెడుతున్నారు. నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఏఈ బీవీ సత్యనారాయయణదొర సూచించారు.



కోనాం జలాశయం నుంచి నదిలోకి విడుదలవుతున్న నీరు

ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళిక

రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

- ఇప్పటికే సమన్వయ కమిటీ ఏర్పాటు
- 63 క్లస్టర్లుగా కొనుగోలు కేంద్రాలు
- 30 వేల టన్నుల వరకు ధాన్యం సేకరించే అవకాశం



ఏపుగా పెరిగిన వరి పైరు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ధాన్యం అమ్ముకునే విషయంలో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు, ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం విక్రయించడానికి ముందుకు వచ్చిన రైతులందరి నుంచి సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ కె.విజయకృష్ణన్, జేసీ జాహ్నవితో కలిసి పౌర సరఫరాల శాఖ అధికారులతో ఇటీవల సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జయంతి ఆధ్వర్యంలో ధాన్యం సేకరణకు సమన్వయ కమిటీని నియమించారు.

వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 54,465 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడం, వాతావరణం అనుకూలంగా వుండడంతో వరిపైరు ఏపుగా పెరుగుతున్నది. ప్రస్తుతం దుబ్బు, పొట్ట దశల్లో వుంది. వచ్చే నెల రెండో వారం నుంచి వరి కోతలు మొదలయ్యే అవకాశం ఉంది. రైతులు తమ వెసులుబాటును బట్టి నూర్పిడి చేసి, ధాన్యం విక్రయిస్తారు. ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు, రైతులకు డబ్బుల చెల్లింపు విషయంలో ఎక్కడా అన్నదాతలు ఇబ్బంది పడకుండా జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సుమారు 90 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. రైతులు ఇంటి అవసరాలు, వచ్చే ఏడాది పంట కోసం ఉంచుకునే విత్తనాలు పోగా, సుమారు 30 వేల టన్నుల ధాన్యం విక్రయిస్తారని అధికారులు భావిస్తున్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ధాన్యం మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఏ గ్రేడ్ రకం క్వింటా రూ.2,389, సాధారణ రకం రూ.2,369కి కొనుగోలు చేయాలని నిర్దేశించింది. ధాన్యం కొనుగోలుకు ముందే ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా కస్టోడియన్ అధికారులను, మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు కమిటీలను నియమించనున్నారు. ఈ కమిటీల ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో 26 బ్లాక్ స్పాట్స్

రోడ్డు ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- 15 రోజుల్లో నివేదిక అందజేయాలి
- ఆయా ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులు ఉండాలి
- నిబంధనలు అతిక్రమించే వాహనాలను ఉపేక్షించొద్దు
- మైనింగ్ ప్రాంతాల్లో శాశ్వత తనిఖీ కేంద్రాలు
- రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం మంగళవారం ఆమె అధ్యక్షతన కలెక్టర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్)గా గుర్తించిన 26 ప్రాంతాల్లో తక్షణమే నివారణ చర్యలు చేపట్టి, 15 రోజుల్లో నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. బ్లాక్ స్పాట్స్‌కు 200 మీటర్ల ముందు నుంచి ప్రతి 50 మీటర్లకు ఒకటి చొప్పున హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు.

వ్యక్తిగత వాహనాలతోపాటు, రవాణా వాహనాలను నిత్యం పర్యవేక్షించాలని, పరిమితికి మించి సరుకు లేదా ఇతర వస్తువులు రవాణా చేసే వాహనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధిక వేగం, రాంగ్‌రూట్‌లో వాహనాలను నడపడం వంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో లంకెలపాలెం నుంచి పాయకరావుపేట వరకు జాతీయ రహదారి నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని, వాహనాల పార్కింగ్, దుకాణాలు ఏర్పాటును నిరోధించాలని చెప్పారు. జాతీయ రహదారిపై నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. మైనింగ్ జరిగే ప్రాంతాల్లో శాశ్వత తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓవర్‌లోడు, అధిక వేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు సూచించిన ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా ఎన్‌హెచ్‌ఏఐ, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బ్లాక్ స్పాట్స్‌గా కొత్తగా గుర్తించిన ప్రాంతాల్లో కమిటీ సభ్యులు ఉమ్మడి తనిఖీలు నిర్వహించి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన చర్యలపై నివేదిక అందించాలన్నారు. బొజ్జన్నకొండ వద్ద భారీ వాహనాలు యూటర్న్ తీసుకోకుండా నిరోధించాలని, వాహనాలు నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించేలా సిబ్బందిని నియమించి పర్యవేక్షణ చేయాలని రోడ్లు-భవనాలు, రవాణా శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో వై.సత్యనారాయణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

వరి పైరుపై పలు రకాల తెగుళ్లు

- సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ ముకుందరావు

... వివరాలు 8వ పేజీలో

పేటలో అన్న క్యాంటీన్

తుది దశకు చేరిన నిర్మాణ పనులు

- త్వరలో ప్రారంభించేందుకు అధికారుల సన్నాహాలు



తుది దశకు చేరిన అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు

పాయకరావు పేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) :

పాయకరావుపేటలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. స్థానిక అరటి గెలల మార్కెట్‌లో ఏర్పాటవుతున్న ఈ క్యాటీన్‌ను త్వరలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదలకు రూ.5లకే భోజనం పెట్టాలన్న ఉద్దేశంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ఎన్టీఆర్ పేరుతో 'అన్న క్యాంటీన్ల'ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని క్యాంటీన్లను మూసి వేశారు. తాము అధికారంలోకి వస్తే 'అన్న క్యాంటీన్ల'ను పునరుద్ధరిస్తామని, అన్ని అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామని కూటమి నాయకులు గత ఏడాది ఎన్నికల ముందు ప్రకటించారు. చెప్పినట్టుగానే తొలుత గతంలో ఏర్పాటు చేసి, వైసీపీ ప్రభుత్వం మూసివేయించిన అన్న క్యాంటీన్లను ఒక్కొక్కటిగా తెరిపించారు. తరువాత అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రాల్లో కొత్తగా క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి శంకుస్థాపనలు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో ఇప్పటికే అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకువచ్చి పేదలకు రూ.5కే అల్పాహారం/ భోజనం పెడుతున్నారు.

మిగిలిన పాయకరావుపేట, చోడవరం, మాడుగులలో క్యాంటీన్లకు భవన నిర్మాణాలు చేపట్టారు. పాయకరావుపేటలోని అరటి గెలల మార్కెట్ స్థలంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ఈ ఏడాది మే నెలలో నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. రూ.61 లక్షలతో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళా క్రికెటర్ల సాధన



విశాఖ విమానాశ్రయంలో దక్షిణాఫ్రికా క్రీడాకారిణులు



నెట్ ప్రాక్టీస్‌లో భారత క్రీడాకారిణులు శ్రీచరణి, రాధా యాదవ్

వన్డే ప్రపంచ కప్ టోర్నీలో భాగంగా గురువారం ఇక్కడ దక్షిణాఫ్రికా జట్టుతో తలపడనున్న భారత మహిళా క్రికెటర్లు మంగళవారం సాయంత్రం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ముమ్మర సాధన చేశారు. హెడ్ కోచ్ అమల్ మజుందర్, బౌలింగ్ కోచ్ అవిష్కర్ సాల్వి, ఫీల్డింగ్ కోచ్ మునిష్ బాలి పర్యవేక్షణలో క్రికెటర్లు ప్రాక్టీస్ చేశారు.

నగరానికి దక్షిణాఫ్రికా జట్టు

సోమవారం ఇండోర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన దక్షిణాఫ్రికా క్రికెటర్లు అక్కడ నుంచి చార్టెడ్ ఫ్లైట్‌లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు.

- వివరాలు స్పోర్ట్సు పేజీలో...

తగ్గిన ధరలకే వస్తువులు విక్రయించాలి

- తూనికలు, కొలతల శాఖ ఏసీ ఆదేశం
- అనకాపల్లిలో పలు షాపులు, మార్ట్‌లలో తనిఖీలు



పట్టణంలోని ఒక మాల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న అధికారులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాలు, మార్ట్‌లలతో తూనికలు- కొలతల శాఖ, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు మంగళవారం జీఎస్టీ అమలు తీరుపై పరిశీలించారు. జీఎస్టీ 2.0 అమలుకు ముందు, సెప్టెంబరు 22వ తేదీ తర్వాత ధరల తేడాలను వారు వినియోగదారులకు వివరించారు. ఈ సందర్భంగా తూనికలు-కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య... పలు రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గినందున గత నెల 22వ తేదీకి ముందుగా తయారైన/ ప్యాకింగ్ చేసిన/ దిగుమతి చేసుకొని వున్న వాటిపై కొత్త చిల్లర అమ్మకం ధర (ఎంఆర్‌పీ) ప్రకటించాలని ఆయా షాపులు, మార్ట్‌ల నిర్వాహకులకు సూచించారు. కొత్త ధరలను స్టిక్కర్లు, స్టాంపింగ్ లేదా ప్రింటింగ్ చేసి వినియోగదారులకు తెలియజేయాలన్నారు. జీఎస్టీ సవరణ తేదీకి ముందు తయారు చేసి, అమ్ముడుపోని వస్తువులపై ఉన్న ఎంఆర్‌పీని సవరించాలన్నారు. వినియోగదారుల ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, తూనికలు- కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు, కన్స్యూమర్ రైట్స్ సేఫ్‌గార్డింగ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లతోనే మోదీ గెలుపు

- పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఆరోపణ
- విశాఖలో 'ఓట్ చోర్- గద్దీ చోడ్' క్యాంపెయిన్



'ఓట్ చోర్-గద్దీ చోడ్' కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

విశాఖపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోర్-గద్దీ చోడ్ (ఓట్ల దొంగ-గద్దె దిగండి) నినాదంతో కాంగ్రెస్ పార్టీ మంగళవారం సాయంత్రం నగరంలో కార్యక్రమం నిర్వహించింది. ఉత్తర నియోజకవర్గ పరిధిలో జరిగిన ఈ క్యాంపెయిన్‌లో పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల పాల్గొన్నారు. స్థానిక ప్రజలతో ఆమె మమేకమై సంతకాలు సేకరించారు. ఓట్ల చోరీ వ్యవహారంపై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటాన్ని ప్రజలకు షర్మిల వివరించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. దేశంలో ఓట్ల చోరీ జరిగిందని, దొంగ ఓట్లతో మోదీ గెలిచారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి సంతకాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు అడ్డాల వర్మరాజు, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి లక్కరాజు రామారావు, నాయకులు ప్రియాంక దండి, తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు ఘనంగా పూజలు


హరిపాలెంలో కొలువు తీరిన గౌరీ పరమేశ్వరులు

అచ్యుతాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హరిపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సోమవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. గ్రామ ఉత్సవ కమిటీ మేళతాళాలతో గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను హరిపాలెం రామాలయంలో పెట్టారు. సుమారు నెల పదిహేను రోజులు పాటు నిత్యపూజలు చేసి నవంబరు 12న నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా ప్రతిరోజు భజనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటుచేస్తారు.

మునగపాకలో..

మండలంలో నాగులాపల్లిలో గౌరీపరమేశ్వరుల నిలుపు ఉత్సవం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. తొలుత ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ క్రీడాకారులకు అభినందనలు


గుంటపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న పీడీ రవికుమార్, ఉపాధ్యాయులు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన డి.రాణి, డి.బాలశ్రీ, జి. అస్మిత్‌లను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ రవికుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా తమ విద్యార్థులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

12న ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవం

అచ్యుతాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న ఆర్ఎస్ఎస్ శతాబ్ది విజయదశమి ఉత్సవం అచ్యుతాపురంలో నిర్వహిస్తున్నామని ఆర్ఎస్ఎస్ ఖండ జిల్లా కార్యవర్గ సభ్యుడు సతీష్ కుమార్ తెలిపారు. స్థానిక బీజేపీ కార్యలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కాంప్లెక్స్ గ్రౌండ్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనికి భారీగా ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు రాజాన సన్యాసినాయుడు, కూండ్రపు నాయుడు, జేవీఎస్ రాజు, మేరుగు కాసుబాబు, పల్లి రాజుబాబు, జయశంకర్, కర్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం'

మునగపాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వం వచిన తర్వాత అభివృద్ధి పరుగు పెడుతోందని టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీను అన్నారు. మంగళవారం నాగులాపల్లిలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయకుమార్ సహకారంతో గ్రామంలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ జామి చిన్నమ్మలు, ఉప సర్పంచ్ గోసాల గోవింద, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ఈసీ మెంబరు గోవింద్‌కు ఘన సత్కారం


బోదెపు గోవింద్‌ను సత్కరిస్తున్న వైసీపీ నాయకులు

ఎలమంచిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ఈసీ మెంబరుగా నియమితులైన ఎంపీపీ బోదెపు గోవింద్‌ను ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణం ధర్మశ్రీ, మునిసిపల్ వైస్ చైర్మన్లు, పార్టీ నేతలు మంగళవారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని వైసీపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ధర్మశ్రీ మాట్లాడుతూ కష్టించి సేవలందించిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా, వైసీపీ పట్టణ, మండల అధ్యక్షులు బొద్దపు యర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, నేతలు పలివెల అమృతవల్లీ, దాసరి కుమార్, కొఠారు గోవింద్, దూది నరసింహమూర్తి, రాపేటి సంతోష్, గొర్లె వెంకట్ పాల్గొన్నారు.

ఏటికొప్పాక విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ


ఏటికొప్పాక విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేసిన దృశ్యం

ఎలమంచిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటికొప్పాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం కళ్లజోళ్లు పంపిణీ చేసినట్టు విశాఖ ఐ ఆస్పత్రి ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. విశాఖ ఐ హాస్పటల్ ట్రస్ట్ వైద్యులు విజయ్‌గోపాల్, పి. వాసుదేవ్ ఈనెల 2వ తేదీన 331 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన 12 మందికి కళ్లజోళ్లను మంగళవారం ఉచితంగా పంపిణీ చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన


జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అధికారులు మంగళవారం మండల కాంప్లెక్స్‌లోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం నుంచి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీలో కేంద్రం చేపట్టిన సంస్కరణలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారావు, సీహెచ్‌ఓ జీడి కృపాచార్యులు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్వీ రమణమ్మ, సన్యాసిరావు, రాజేశ్వరి, అప్పలకొండ పాల్గొన్నారు.

రహదారులు గోతులమయం

- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- వర్షం వస్తే చెరువును తలపిస్తున్న ప్రశాంతినగర్ రోడ్డు


ప్రశాంతినగర్‌లో చెరువును తలపిస్తున్న రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

పాయకరావుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పట్టణంలోని పలు కాలనీల రోడ్లు బురదమయమయ్యాయి. కొన్ని రోడ్లపై గుంతలు ఏర్పాడ్డాయి. మరికొన్ని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఈ రోడ్లపైనే కాలనీవాసులు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పాయకరావుపేట పంచాయతీలో ఇప్పటివరకు వేసిన లేఅవుట్లలో దశాబ్దాలుగా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ తదితర మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలనీల్లో ప్రధాన రోడ్లు తప్పించి మిగిలినవన్నీ మట్టిరోడ్లు కావడంతో గోతులు ఏర్పడి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మంగవరంరోడ్డు జంక్షన్ నుంచి వై.జంక్షన్ వరకు మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలనీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా మురికినీరు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నది. వర్షాకాలంలో నీరు బయటకు పోయే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో కాలనీల్లో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిరోజులుగా పడుతున్న వర్షాలకు మట్టిరోడ్లు బురద, గుంతలుగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


రాజుగారిబీడులో అధ్వానంగా మారిన సందప్ప చెరువు రోడ్డు


సాయినగర్ ప్రధాన రహదారి గుంతల్లో చేరిన నీరు

రోడ్డు నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వాలి : ఎమ్మెల్యే సుందరపు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్


నాగులాపల్లి సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు నిర్వాసితులకు వెంటనే టీడీఆర్ బాండ్లు చెల్లించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం తన స్వగృహంలో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు త్వరగా చెల్లించి, రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే సెజ్‌తో పాటు బార్క్ నిర్వాసితులైన పూడి, తంతడి, చిప్పాడ తదితర గ్రామాల నిర్వాసితులకు పునరావాసంతో పాటు పరిహారం తక్షణం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో ఆయేషా, ఏపీఐఐసీ ఎస్‌డీసీ అనిత, ఏపీఐఐసీ డెప్యూటీ జెడ్ఎం సూర్యనారాయణ, తహశీల్దార్ జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి వరం అని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం తన నివాసంలో 12 మందికి రూ.5.35 లక్షల సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల వైద్య ఖర్చుల నిమిత్తం ఎన్నో కుటుంబాలకు ఈ పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, మోటూరు శ్రీవేణి, ద్వారపురెడ్డి బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు దోచుకోవడం తెలియదు

మునగపాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతన్నకు కష్టాన్ని, నష్టాన్ని గుండెల్లో దాచుకోవడమే తప్ప దోచుకోవడం తెలియదని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలో నాగులాపల్లి సొసైటీ సభ్యరైతులకు మంగళవారం బోనస్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పులు చేసి వ్యవసాయాన్ని రైతు బతికిస్తున్నాడన్నారు. అటువంటి రైతును రాజు చేసే ఆలోచనలు చేసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన సహకార సంఘం శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకుందామన్నారు. సేంద్రియ వ్యవసాయం వైపు ఆలోచనలు చేయాలన్నారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ యల్లపు వెంకటభాస్కరరావు మాట్లాడుతూ సొసైటీలో 3,655 మంది రైతులకు రూ.6.6లక్షలు డివిడెండ్‌ను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పర్సన్ కొంతం జగదీశ్, సీఈవో మళ్ల స్వామి, కూటమి నాయకులు మళ్ల కాలేశ్వరరావు, టెక్కలి పరశురాం, విల్లూరి నర్సింగరావు, దాడి ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల నిరసన

సమస్యలపై వైద్యులకు వినతిపత్రాల అందజేత


మునగపాక వైద్యులు నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

అచ్యుతాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ కోర్కెలు తీర్చాలంటూ ఆశ వర్కర్లు అచ్యుతాపురం, హరిపాలెం పీహెచ్‌సీల వద్ద నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని, తమను కార్మికులుగా గుర్తించి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రెండు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు ఎన్. సూర్యలక్ష్మి, సీహెచ్ మంగమ్మ, ఎస్. పార్వతి, దేవుడమ్మ, పల్లవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మునిసిపాలిటీలోని పెదపల్లి, సోమలింగపాలెం వార్డుల్లోని అర్బన్ హెల్త్ సెంటర్ల వద్ద ఆశ కార్యకర్తలు నిరసన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలంతా సమస్యలతో కూడిన వినతిపత్రాలను హెల్త్ సెంటర్ల వైద్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాము, ఆశ కార్యకర్తల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల వద్ద ఆశ వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వినతి పత్రాలను వైద్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ ఆశవర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మంగ, ఆర్.రమ్య, తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో..

ఆశ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ జిల్లా కోశాధికారి పార్వతి డిమాండ్ చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు నాగలక్ష్మికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు కుమారి, వెంకటలక్ష్మి, అరుణ, జయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ చోర్‌పై కాంగ్రెస్ సంతకాల సేకరణ


పాయకరావుపేటలో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాయకరావుపేట అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఓట్ చోర్-గద్ది చోడ్ కార్యక్రమానికి ప్రజల మద్దతు కోరుతూ మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక చిత్రమందిర్ సెంటర్ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఓట్ల దొంగతనం జరిగిందని, దీనివలనే బీజేపీ గెలుపొందిందని ఆరోపించారు. బీజేపీ గెలుపు కోసం ఓటర్ల జాబితాల్లో దొంగ ఓట్లు చేర్చడం, కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అవకాశం ఉన్నచోట్ల కాంగ్రెస్ సానుభూతి పరుల ఓట్లను తొలగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నారాయణ చక్రవర్తి, నాయకులు పోలవరపు అప్పలరాజు, జి.గోవిందు, ఎం.శంకర్, పి.చక్రధరరావు, ఎన్.నూకరాజు, బి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ పాలనలో దేశంలో న్యాయవ్యవస్థతో పాటు ఎన్నికల కమిషన్‌ని నిర్వీర్యం అవుతున్నాయని కాంగ్రెస్ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయ కర్త తనకాల అనంతరావు అన్నారు. మంగళవారం తిమ్మరాజుపేటలో ఓట్‌చోర్.. గద్దెచోడ్ కార్యక్రమంలో భాగంగా సంతకాల సేకరణ జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రారంభించిన ఈకార్యక్రమానికి దేశంలో విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పొలమరశెట్టి ఆదిమూర్తి, రావి రాంసత్యం, దొడ్డి రవి, భీశెట్టి మోహన్, కాండ్రేగుల సంజీవ్, కె. లక్ష్మణరావు, నాగుమంత్రి సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో కుక్కల స్వైరవిహారం


ఎలమంచిలి బాలుర కళాశాల హాస్టల్ వద్ద రోడ్డుపై ఉన్న కుక్కలు

ఎలమంచిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ ప్రాంతంలో చూసినా ఇవే కనిపిస్తున్నాయి. రోడ్డుపై వెళుతున్న వారిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. పట్టణంలో కుక్కకాటు బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. పట్టణంలో ఏవీధిలో చూసినా వీధి కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. పట్టణంలో ఎలమంచిలి ప్రధాన రోడ్డు, దిమిలి రోడ్డు జంక్షన్, ఎల్ఐసీ కార్యాలయం జంక్షన్, కొత్తపేట, పరమేశ్వరి థియేటర్ రోడ్డు జంక్షన్, ధర్మవరం, నెహ్రూనగర్, గాంధీనగర్, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల తాకిడి విపరీతంగా ఉంది. అదే విధంగా పట్టణంలోని నివాస ప్రాంతాల వద్ద పందులు గుంపులుగా తిరుగుతున్నాయి. వీటి కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తుంది. మునిసిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గూడుపమ్మకు సప్తహారతులు



నక్కపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయంలో పౌర్ణమి తిథి సందర్భంగా మంగళవారం రాత్రి అమ్మవారికి సప్తహారతులు ఇచ్చారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం సప్తహారతులు ఇచ్చారు. ఈ పూజల్లో ఆలయ ధర్మకర్త శ్రీహరిరాజు, శానపతి విజయ్, ప్రగడ బోస్, సూరిబాబు, రమణబాబు, పాయకరావుపేటకు చెందిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో న్యాయవాదులు విధుల బహిష్కరణ


ఎలమంచిలిలో విధులు బహిష్కరించిన బార్ అసోసియేషన్ సభ్యులు

ఎలమంచిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజేఐపై జరిగిన అమానవీయ సంఘటనకు నిరసనగా మంగళవారం ఎలమంచిలి కోర్టులో విధులు బహిష్కరించినట్టు న్యాయవాదులు తెలిపారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్, నగదు అప్పగింత


సెల్‌ఫోన్, నగదు తిరిగి ఇస్తున్న ఏఎస్‌ఐ నాయుడు

పాయకరావుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్, నగదును పోలీసులు తాళ్లపాలెం గ్రామానికి చెందిన వ్యక్తికి మంగళవారం తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ జి.అప్పన్న మాట్లాడుతూ తాళ్లపాలెం గ్రామానికి చెందిన చిన్ని జనార్దనరావు తుని పక్కనే ఉన్న సూరవరంలో అత్తవారింటికి వచ్చాడన్నారు. మంగళవారం రాత్రి బైక్‌పై తిరిగి వెళుతుండగా పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న స్పీడు బ్రేకర్‌పై సెల్‌ఫోన్, బ్యాగు పడిపోయాయన్నారు. వెంటనే జనార్దనరావు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారణ చేపట్టి లొకేషన్ పెట్టడంతో అర్ధగంటలో తమ సిబ్బంది ట్రేస్ చేసి జనార్దనరావుకి సెల్‌ఫోన్, పది వేలు ఉన్న బ్యాగును అందజేసినట్టు సీఐ అప్పన్న తెలిపారు.

కాంగ్రెస్ నేతలను అడ్డుకున్న పోలీసులు


పోలీసుల అదుపులోకి తీసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాయకరావుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేయవద్దని రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపేందుకు పాయకరావుపేట నుంచి వెళుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు మాట్లాడుతూ 30 యాక్ట్ అమలులో ఉన్నందున ఇతర ప్రాంతాల వారికి అనుమతి లేదన్నారు. డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మారుతి నారాయణ చక్రవర్తి, జిల్లా కార్యదర్శి పోలవరపు అప్పలరాజు, నాయకులు జి.గోవిందు శంకర్, ప్రగడ చంద్రరావు, నడింపల్లి నూకరాజు, బి.జగన్నాథం తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సీజేఐపై దాడి గర్హనీయం : జనవిజ్ఞాన వేదిక

అచ్యుతాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై న్యాయస్థానంలోనే దాడికి తెగబడడం తీవ్ర గర్హనీయమని జనవిజ్ఞాన వేదిన మండల శాఖ ప్రతినిధులు మారిశెట్టి వెంకట అప్పారావు, ఉప్పాడ రాము, బొడ్డేడ రామ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ దాడి కేవలం ఒక వ్యక్తిపై దాడిగా కాక, భారత రాజ్యాంగంపై దాడిగా పరిగణిస్తూ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలోని గల పలు గ్రామాల్లో చేపట్టనున్న ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.రాయవరం రూరల్, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీ పాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాలతో పాటు ఎలమంచిలి మండలం పద్మనాభరాజుపేట, పులపర్తి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభల కరపత్రాల పంపిణీ

అచ్యుతాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలంటూ అచ్యుతాపురం మహిళా సంఘం ప్రతినిధులు మంగళవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. సెజ్‌లో గల దుస్తుల కర్మాగారంలో పనిచేస్తున్న మహిళలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్. లక్ష్మి, ఎస్ పద్మ, రమణమ్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ

నర్సీపట్నం, అక్టోబబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు సీబీఎం కాంపౌండ్ చర్చి స్థలాల వివాదంపై తహసీల్దార్ రామారావు విచారణ చేశారు. మంగళవారం సర్వేయర్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ నాయుడు, వీఆర్వో కుమార్‌తో ఆయన సీబీఎం కాంపౌండ్ ఆవరణ వద్దకు వచ్చారు. అక్కడ ఫిర్యాదుదారు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత డాక్యుమెంట్లు అందజేయాలని సూచించారు.

'వన్య ప్రాణులను వేటాడకూడదు'


పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో వన్య ప్రాణుల వారోత్సవాలు జరుపుతున్న అధికారులు

నాతవరం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణులను సంరక్షణపై మంగళవారం పెడిమికొండ రిజర్వు ఫారెస్టు పరిధిలోని గిరిజనులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి చిరంజీవి మాట్లాడుతూ వన్య ప్రాణులను ఎవ్వరూ వేటఆడవద్దని సూచించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు నాగరాజు మహంతి, పి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

వాల్మీకి ఆలోచనలు స్ఫూర్తిదాయకం

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి ఆలోచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహర్షి వాల్మీకి భారతీయ సాహిత్యంలో ఆదికవిగా నిలిచారన్నారు. ఆయన రచించిన రామాయణం నిత్య నూతనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణ రావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామాయణం మానవతా విలువలకు స్ఫూర్తి

ఎస్పీ తుహిన్‌సిన్హా



వాల్మీకి చిత్రపటానికి నమస్కరిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మానవతా విలువలకు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం మానవజాతికి మధురమైన మార్గదర్శి కావ్యమన్నారు. యుగాలు గడిచినా సమాజానికి ఆదర్శంగా నిలిచిన విలువలను రామాయణం అందించిందన్నారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆవలంబించుకోవాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దేవప్రసాద్, నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

» ఆటో డ్రైవర్లకు డీఎస్పీ శ్రావణి హెచ్చరిక



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. మంగళవారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ఆవరణలో ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటార్ వాహన చట్టం నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. అతి వేగంగా, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆటోలో ఎక్కిన ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. ఆటో రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్సు కూడా అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపివేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఎంవీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీఐలు ఎం.వెంకటనారాయణ, టీవీ విజయ్‌కుమార్, అశోక్ కుమార్, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట

» జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి



అన్న క్యాంటీన్ ఆవరణలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న జడ్సీ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్నుల భారం భారీగా తగ్గించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభిస్తున్నదని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి చెప్పారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, వ్యాపార రంగాలకు ఎన్డీయే ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం తగ్గిన జీఎస్టీ ధరల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

లంకెలపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో లంకెలపాలెం కూడలిని మంగళవారం వైసీపీ నేతలతో కలిసి ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పరిశీలించారు. ఈ నెల 9న మాకవరపాలెంలో మెడికల్ కళాశాల సందర్శనలో భాగంగా ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో లంకెలపాలెం మీదగా జగన్ రానున్నారు. ఈ క్రమంలో కూడలిని పరిశీలించి, భారీగా జన సమీకరణ చేపట్టాలని నాయకులకు రఘురామ్ సూచించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, ధర్మశ్రీ, నాయకులు బొడ్డేడ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

జగన్ పర్యటనను జయప్రదం చేయాలి

పరవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లంకెలపాలెం కూడలిలో ఐదు వేల మంది కార్యకర్తలతో జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు తప్పనిసరిగా పాల్గొవాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసి రాజు, పార్టీ నాయకులు గండి రవికుమార్, చుక్క రామునాయుడు, బంధం నాగేశ్వరరావు, బుస అప్పలరాజు, పెదిశెట్టి శేఖర్, బొండా కనకారావు, బొద్దపు చిన్నారావు, పైలా సత్యనారాయణ పాల్గొన్నారు.

అలజడి సృష్టికే జగన్‌రెడ్డి పర్యటన

» మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్, పక్కన నాయకులు

తుమ్మపాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకే అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో మెడికల్ కాలేజి సందర్శన పేరుతో మాజీ సీఎం జగన్‌రెడ్డి పర్యటన పెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అనకాపల్లిలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసి భూములను కొట్టేసే ప్రయత్నం చేశారన్నారు. అన్ని పార్టీలు తిప్పికొట్టడంతో తోక ముడిచారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్రలో మెడికల్ కాలేజీలకు రూ.2100 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా మాకవరపాలెం, విజయనగరం, పాడేరు, పార్వతీపురం కాలేజీల నిర్మాణానికి కేవలం రూ.212 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. పార్వతీపురంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి కనీసం టెండర్లు కూడా పిలవలేదన్నారు. వైసీపీ పాలనలో మెడికల్ కళాశాలల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు అంచనా వ్యయం పెట్టి కేవలం రూ.11 కోట్లు ఖర్చు చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి తీరు మార్చుకొని ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సూచనలు చేసేలా ముందుకు సాగాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కె.రామకృష్ణ, బోడి వెంకట్రావు, కాండ్రేగుల సత్యనారాయణ, కుప్పిలి జగన్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ



మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

తుమ్మపాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్టు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం 80వ వార్డు టీడీపీ శ్రేణులతో పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2029 నాటికి అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలను అందించనున్నట్టు చెప్పారు. సంక్రాంతి నాటికి మూడు లక్షల ఇళ్లను అందించడమే లక్ష్యమన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పై ప్రజలకు పార్టీ శ్రేణులు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజలకు సూపర్ జీఎస్టీ దసరా కానుక అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, సబ్బవరపు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

కొత్తూరు, సత్యనారాయణపురం ప్రధాన రహదారులపై ఏరులై పారిన వరద

సత్యనారాయణపురం పంచాయతీలో ఉధృతంగా ప్రవహిస్తున్న దొంగగెడ్డ

రాకపోకలకు వాహనదారులు, ప్రజల పాట్లు





పంట కాలువను తలపిస్తున్న శారదానగర్ ప్రధాన రహదారి.. ఉధృతంగా ప్రవహిస్తున్న దొంగగెడ్డ

కొత్తూరు, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి కొత్తూరు, సత్యనారాయణపురం పంచాయతీల్లో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. సాయినగర్‌లోని కొన్ని నివాసాల్లోకి వర్షం నీరు చేరింది. పలు రహదారుల్లో నడుం లోతు వరకూ వర్షపు నీరు చేరింది. దీంతో పాదచారులు, వాహన చోదకుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

శారదానగర్ ప్రధాన రహదారి మూడో వీధి వద్ద పెద్ద ఎత్తున నీరు చేరింది. వీధి మొత్తం నీటితో నిండిపోయింది. ముత్రాసు కాలనీ, నాలుగో వీధి, మూడో వీధి, ఐదో వీధి, 13వ వీధిలో ఎక్కడికక్కడే నీరు స్తంభించిపోయింది. శారదానగర్, ముత్రాసుకాలనీ, సాయినగర్, దేవీనగర్, ఇస్లాంపేట రహదారులు నీట మునిగాయి. దీంతో ఆయా మార్గాల్లో రాత్రి వరకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

కొత్తూరు, సత్యనారాయణపురం పంచాయతీల పరిధిలో ఉన్న దొంగ గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీంతో రహదారులన్నీ కనిపించకుండా మునిగిపోయాయి. సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట, పోస్టల్ కాలనీ, సత్యనారాయణ కాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి. నాలుగు కిలో మీటర్లు తిరిగి ఏఎంఏఎల్ హైస్కూలు మీదుగా రాకపోకలు సాగించారు. దొంగగెడ్డ మార్గంలో రైల్వే వంతెన కింద మార్గం పూర్తిగా మూసుకుపోయింది.

ఉపాధి కూలీలకు ముఖ ఆధారిత హాజరు

» డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమదేవి

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులకు ముఖ ఆధారిత హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్టు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.పూర్ణిమదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వేతనదారులందరికీ ఎన్ఎంఎంఎస్ ఈకేవైసీ ద్వారా కార్డులో ఉన్న ముఖంతో పోల్చి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో ఒకరికి బదులు మరొకరు పనికి రాకుండా నియంత్రించేందుకు ముఖ ఆధారిత ద్వారా హాజరు వేసే పద్ధతి ప్రారంభించినట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఉపాధి హామీ పనులకు వచ్చే వారి సంఖ్య 3,68,156 మంది ఉండగా వారందరికీ ఈకేవైసీ జరుగుతుందన్నారు. వేతనదారులందరూ ఆధార్, జాబ్ కార్డులతో క్షేత్ర సహాయకుడి వద్ద ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని పీడీ సూచించారు. ఈకేవైసీ చేయని వారికి హాజరు, వేతన చెల్లింపులకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

డైట్‌లో ఐఈఈఈ డే

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఐఈఈఈ డేను ఘనంగా నిర్వహించారు. అమెరికాలోని నార్త్ వర్జీనియాకు చెందిన ఎంటర్‌ప్రైజెస్ ఇన్‌ఫర్మేషన్ ప్రొటెక్షన్ డివిజన్‌లో సైబర్ సెక్యూరిటీ లీడర్‌గా వ్యవహరిస్తున్న ఎం.గణేశ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతికత కోసం పనిచేస్తున్న ఇంజినీర్‌లను గుర్తించే రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మెరుగైన రేపటి కోసం సాంకేతికతను ఉపయోగించడం అనే నినాదంతో యువ ఇంజినీర్లలో సాంకేతికతపై ఆసక్తి పెంపొందించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి ఈ వేడుకలను నిర్వహిస్తున్నారన్నారను. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ ఐఈఈఈ ద్వారా విద్యార్థులు పొందగలిగే లాభాలను వివరిస్తూ ప్రోత్సహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, ఎ.కృష్ణనాగ్, గోపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

కశింకోట, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలులో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై మంగళవారం జిల్లా స్థాయి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు జరిగాయి. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సింధుప్రియ, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్వేత పోటీలను సందర్శించారు. జిల్లా నలుమూలల నుంచి పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రాయింగ్ పోటీల్లో నక్కపల్లి జడ్పీహెచ్ పాఠశాలకు చెందిన కె.చైత్రిని, పరవాడ మండలం సర్వజ్ఞ పాఠశాల విద్యార్థిని పి.హస్మిత, కన్నూరుపాలెం ఈ.చౌడువాడ జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థి సిహెచ్.సుశాంత్, వ్యాసరచన పోటీల్లో వి.మాడుగుల మండలం కేజే పురం హైస్కూల్ విద్యార్థి కె.మోహిత, చోడవరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన టి.మౌనిషదేవి, రాంబిల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.లాలిని వరుస మూడు స్థానాలు సాధించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నంబారు సత్యారావు, మిట్లపాటి సూర్యదాస్, పి.వి.ఆర్. రమేష్, గౌతమ్, కె.గణేష్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో డీఈవో సీసీ వెంకటేశ్వర్లు, ఎంఈవోలు మూర్తి, పి.వి.సురేశ్, హెచ్ఎం ఎన్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

అవయవ దానంతో పునర్జీవులు కావాలి

నర్సీపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం చేసి పునర్జీవులు కావాలని అఖిల భారత శరీర, అవయవ దాత సంఘం అధ్యక్షురాలు డాక్టర్ గూడురూ సీతామహాలక్ష్మి కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందరర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రైన్ డెడ్ అయిన వారు అవయవ దానం చేస్తే నలుగురికి ప్రాణ దానం చేయవచ్చన్నారు. దాత అవయవాలు సకాలంలో తరలించడానికి ప్రభుత్వం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేస్తుందన్నారు. అవయవ దానం చేసి మానవీయ సమాజం నిర్మించాలని కోరారు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీ పద్మావతి, లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ దస్త్రాల రాఘవేంద్ర రావు, అధ్యక్షుడు కె. సతీశ్, ట్రెజరర్ బీఎస్ఆర్ శర్మ పాల్గొన్నారు.

సీజేఐ ఘటనపై బార్ అసోసియేషన్ నిరసన



న్యాయస్థానాల సముదాయం భవనం ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన ఘటనపై అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు పిళ్లా హరశ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని వెల్లడించారు. తప్పు ఎవరిదన్నది పక్కన పెడితే న్యాయ వ్యవస్థలో ఇలాంటి ఘటన శోచనీయమన్నారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు బంధం రమణ, సుంకర శ్రీనివాస్, సుధాకర్, జగపతి, సాయిరాం ప్రభాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు డీపీఎన్ విద్యార్థి ఎంపిక



పోటీలకు ఎంపికైన మధు

కశింకోట, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు డీపీఎన్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి మధు ఎంపికైనట్టు హెచ్ఎం ఎన్.జె.వి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. అనకాపల్లి పట్టణం వేల్పులవీధి ఎస్.ఆర్.డి. జిమ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 69వ ఎస్.జి.ఎఫ్ అండర్-17 బాలుర విభాగంలో 60 కిలోల విభాగంలో మధు స్వర్ణపతకం, జె.రాంచరణ్, షేక్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరి రజిత పతకాలు సాధించారన్నారు. వీరిలో స్వర్ణ పతకం సాధించిన మధు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు మధును అభినందించారు.

కొత్తూరులో అలంకారప్రాయంగా వీధి లైట్లు



వెలగని విద్యుత్ వీధి లైటు

కొత్తూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కొత్తూరు పరిధిలోని చోట్ల వీధి లైట్లు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో లైట్లు వెలగకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడక్కడ సోలార్ లైట్లు ఉన్నప్పటికీ లైటింగ్ పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో సోలార్ లైట్లు వేయడం వల్ల కొంత మంది నాయకులు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేసుకున్నారు. సోలార్ లైట్లు వేయడంలో సమ న్యాయం జరపలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చీకటి రోజుల్లో విద్యుత్ దీపాలు లేని చోట్ల ప్రజలు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా పాములు సంచరించే ప్రాంతాల్లో రాత్రి వేళ బయటకు రావడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అవసరమైన ప్రాంతాల్లో తక్షణమే విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ కోటిబాబుకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న దాడి కోటిబాబు

కొత్తూరు, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ దాడి కోటిబాబు గౌరవ డాక్టరేట్ లభించింది. హైదరాబాద్ లకడీకపూల్‌లో ఫిల్మ్ ఛాంబర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు పృథ్వీ, యూనివర్శిటీ ప్రతినిధి డాక్టర్ వరప్రసాద్ కోటిబాబుకు ఈ అవార్డును అందజేశారు. అనకాపల్లి మండలం కొత్తూరులో నివాసం ఉంటున్న కోటిబాబు పోలీసు విధులు నిర్వహిస్తూనే సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. హైదరాబాదు, తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీకాకుళం, అనకాపల్లి, గాజువాక ప్రాంతాల్లో ఆయన అందించిన సేవలకు ఈ అవార్డు లభించింది.

నేషనల్ అప్రెంటిస్‌షిప్‌పై సదస్సు రేపు

అనకాపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్‌పై పరవాడ ఫార్మాసిటీలోని జేఎన్‌పీసీ తయారీ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 9న సదస్సు నిర్వహించనున్నట్టు సౌత్ ఇండియా హెడ్ పి.అమరేంద్రబాబు తెలిపారు. లైఫ్ సైన్సెస్ స్కిల్ సెక్టార్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, జేఎన్‌పీసీఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. స్టైఫండ్, నూతన నియమావళి, ప్రభుత్వ సాయం, సీఎస్ఆర్ నిధుల వినియోగం, మానవ వనరుల అభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 90595361122, 8800282887 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కశింకోట, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ రాజ్‌కుమార్ సూచించారు. తేగాడ కేజీబీవీ పాఠశాలలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించి ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రోజూ వ్యాయామం చేస్తూ తోటి వారిని గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా సమన్వయ అధికారిణి ఎ.ఎస్.డి.జమీమా, కేజీబీవీ ప్రిన్సిపాల్ డి.చంద్రకళ పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులను మెరుగుపరిచి అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.హనుమశ్రీకి వినతిపత్రం అందజేశారు. జిల్లాకు ప్రధాన కేంద్రమైన అనకాపల్లి కాంప్లెక్స్‌లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని గుర్తించి సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సంస్థ వ్యవస్థాపకులు బల్లా నాగభూషణం కోరారు. వర్షం పడితే ఆవరణలోకి రావడానికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వర్షాలు పడినప్పుడు నీరు నిల్వ ఉండకుండా, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'తిరుపతి ప్రత్యేక రైలులో జనరల్ బోగీలు పెట్టాలి'

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం అనకాపల్లి నుంచి తిరుపతికి వెళ్లే ప్రత్యేక రైలులో సామాన్య ప్రయాణికులకు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని అమ్ఆద్మీ కన్వీనర్ కొణతాల హరనాథబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం రైల్వేస్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రైలులో అన్ని ఏసీ బోగీలు కావడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు, దివ్యాంగులు, మహిళలు ప్రయాణం చేసేందుకు అవకాశం లేకపోవడంతో నిరాశ చెందుతున్నారని చెప్పారు. వచ్చే సోమవారం నుంచి ప్రతి వారం ప్రత్యేక రైలుకు జనరల్ బోగీలు, రిజర్వేషన్ బోగీలు అందుబాటులోకి తీసుకువచ్చి శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

కుంచంగిలో పశు గర్భకోశ చికిత్స శిబిరం

కొత్తూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని కుంచంగి గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం మంగళవారం జరిగింది. 58 పశువులకు గర్భకోశ తనిఖీలు చేసి అవసరమైన మందులు అందజేశారు. శిబిరంలో పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ పశువులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీతానగరం పశు వైద్యాధికారి బి.రామారావు మాట్లాడుతూ రైతులు పాడి పశువులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయించుకోవాలని సూచించారు. తద్వారా గర్భకోశ వ్యాధి నివారణకు జాగ్రత్తలను పాటించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గవరపాలెం పశు వైద్యాధికారి అనిల్‌కుమార్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రాజ్‌కుమార్, గ్రామ నాయకులు పి.సూర్యజగ్గారావు, పి.నాగేశ్వరరావు, పి.రామారావు, పి.శ్రీను పాల్గొన్నారు.

వైద్యులకు మద్దతుగా ఆందోళన

పరవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చేపడుతున్న సమ్మెకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు వాడచీపురుపల్లి పీహెచ్‌సీ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఇదే విషయమై ఈ నెల ఐదో తేదీ నుంచి రిలే నిరాహారదీక్షలు కూడా చేపడుతున్నారన్నారు. ప్రభుత్వం కలుగజేసుకొని డాక్టర్ల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం సభ్యులు లక్ష్మి, దేముడమ్మ, వరలక్ష్మి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంగులయ్యకు సత్కారం..

లంకెలపాలెం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వంపూరు గంగులయ్యను జిల్లా గ్యాస్ ఏజెన్సీ డెలివరి బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పెదముషిడివాలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోన గోవింద్, ప్రతినిధులు పి.వేణు, బి.బుజ్జి, బి.రమణ, జె.నాగేంద్రరెడ్డి, అప్పారావు, సన్యాసిరావు, అమరపిన్ని సాగర్, సాయికిరణ్, వెంకట్, కుమార్, వెంకటరావు, శ్రీను, సుజాత, సునీత, షణ్ముఖ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీజేపీ నేత ఆర్థిక సాయం

పరవాడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పరవాడ శిరపురపువారి వీధిలో అనారోగ్యంతో బాధ పడుతున్న బారపు లక్ష్మికి వైద్య సేవల కోసం బీజేపీ నాయకుడు కూండ్రపు సోమునాయుడు ఆర్థిక సాయం అందించారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల విషయం తెలుసుకున్న సోమునాయుడు మంగళవారం రూ.70 వేలు సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జనసేన నేత నాగరాజు, బ్యాడ్ బాయ్స్ సభ్యులు బి.అజయ్, లాలం సురేశ్, గండి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి సైకిల్ వీడర్లు


అనంతగిరి రైతు భరోసా కేంద్రం వద్ద సైకిల్ వీడర్లు

అనంతగిరి, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంటపొలాల్లో కలుపును తీసే సైకిల్ వీడర్ల అందుబాటులోకి తీసుకువచ్చింది. స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ఈ సైకిల్ వీడర్ల పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి రంగారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమారి మంగళవారం తెలిపారు. 150 సైకిల్ వీడర్లు అందుబాటులో ఉన్నాయని, 90 శాతం సబ్సిడీపై వీటిని రైతులకు ప్రభుత్వమందిస్తోందని వివరించారు. విత్తనాలు, యూరియా అందించడంతోపాటు ఇప్పుడు వీడర్లు పంపిణీ చేస్తుండడంపై రైతులు హర్షంవ్యక్తంచేస్తున్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి: డీఎంహెచ్‌వో


పీహెచ్‌సీ రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

జి.మాడుగుల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందించాలని డీఎంహెచ్‌వో టి విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. అనంతరం ఆశ కార్యకర్తల కార్యక్రమానికి హాజరయ్యారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎన్.ప్రకాశ్, లక్ష్మణ్, నూకరాజు, మేనక, రత్నం పాల్గొన్నారు.

డౌనూరులో అంధకారం


మరమ్మతుకు లోనైన ట్రాన్స్‌ఫార్మర్

కొయ్యూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డౌనూరులో 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం రాత్రి ఉరుములతో పాటు పెనుగాలులకు విద్యుత్ సరఫరా అంతరాయం నెలకొంది. సంబంధిత శాఖ సిబ్బంది సోమవారం తిరిగి సరఫరా పునరుద్ధరించారు. డౌనూరుతో పాటు మిగిలిన గ్రామాలకు ఈ గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌నుంచి విద్యుత్ సరఫరా చేశారు. దీంతో కేవలం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా కొనసాగిన అనంతరం ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం మానేసింది. ఈ విషయం స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా సమస్య పరిష్కార చర్యలు చేపట్టక పోవటంతో సోమవారం రాత్రి నుంచి డౌనూరు గ్రామంలో అంధకారంలో నెలకొంది. మంగళవారం సాయంత్రం గ్రామస్థులు చింతపల్లి ట్రాన్స్‌కో ఏడీకి సమాచారమందించారు. సిబ్బంది ఎప్పుడు వచ్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారోనని ఆ గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు.

ఉత్తమ అవార్డుపై హర్షం


కలెక్టర్‌నుంచి అవార్డు అందుకున్న అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి

అనంతగిరి, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌నుంచి ఉత్తమ అవార్డు అందుకున్న మండలంలోని కొండిబ పంచాయతీ డముకు అంగన్‌వాడీ కార్యకర్త సోవేరి లక్ష్మిని సహ కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులు అభినందించారు. స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా సోమవారం కలెక్టర్ దినేశ్‌కుమార్, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్, ఐటీడీఏ పీవో శ్రీపూజలనుంచి ఉత్తమ అవార్డును లక్ష్మి అందుకున్నారు. ఈ నేపథ్యంలో సీడీపీవో సుగుణ, కార్యకర్తలు కళావతి, మంజుల, తదితరులు ఆమెను అభినందనలు తెలిపారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాన్ని జయప్రదం చేయాలి

సీలేరు, అక్టోబర్7(ఆంధ్రజ్యోతి) జీకేవీధి మండలం ధారకొండలో ఈనెల9న రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ధి ఉత్సవాన్ని జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆడారి సుహాసినీ, జోరంగి దేవేంద్రకోరారు. ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పిలివాడ పంచాయతీ గ్రామాల్లో కరపత్రాలు పంచారు. ధారకొండ శీతారాముల దేవాలయం వద్ద ఈనెల 9 ఆర్ఎస్ఎస్ శాతాబ్ధి ఉత్సవానికి అన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో తగ్గి వసంత, చీర్ల రామకృష్ణ, దారీస్వరావు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే జీఎస్టీ తగ్గింపు

» జీసీసీ ఛైర్మన్ శ్రావణ్ కుమార్

డుంబ్రిగూడ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదరికం నిర్మూలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు తీసువచ్చినట్టు జీసీసీ ఛైర్మన్ శ్రావణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో విజయనగరం ఆర్టీసీ జోన్ ఛైర్మన్, అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొరతో కలసి దుకాణాల వద్దకు వెళ్లి చెంత కరపత్రాలను పంచారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. దేశ వ్యాప్తంగా జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సబ్బులు, ఉప్పు, నూనె తదితర సరకులపై భారం తగ్గుతున్నారు. దొన్నుదొర మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రతీ కుటుంబానికి రూ. 15వేల వరకు ఆదా అవుతుం'న్నారు. సూపర్ సిక్స్ పథకాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకుంటుదన్నారు. ప్రతీ గిరిజన కుటుంబాల చెంతకు సంక్షేమం అభివృద్ధిని తీసుకువెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు, ఎస్టీ కమిషన్ సభ్యుడు సాయిరాం, ఎంపీటీసీ సభ్యురాలు గీత, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరావు, పీఏసీఎస్ ఛైర్మన్ సుబ్బారావు, దన్నేరావు తదితరులు పాల్గొన్నారు.


డుంబ్రిగూడలో జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పిస్తున్న శ్రావణ్ కుమార్, దొన్నుదొర


రావణాపల్లి ఆశ్రమ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొయ్యూరు: జీఎస్టీ స్లాబుల సవరణతో సామాన్యులకు చేకూరే ప్రయోజనాలపై మంగళవారం రావణాపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎంపీడీవో బాలమురళీ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మృదుబాషిణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: జీఎస్టీ తగ్గింపు ధరలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు పేర్కొన్నారు. సింగర్బ పంచాయతీ ఈదులబయలు గ్రామంలో ఎంపీపీ అప్పలరాజుతో కలిసి ప్రచారం చేశారు. జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం కోసం రైతుల ఆందోళన


రిలే నిరాహార దీక్ష చేపడుతున్న బాధిత కాఫీ రైతులు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలసలో కాఫీ రైతుల రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంలో కాఫీ తోటలను నష్టపోతున్న తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం పరిహారం చెల్లించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని బాధిత రైతులు ఈ సందర్భంగా తెలిపారు.

దండకారుణ్య సొసైటీకి ఉత్తమ అవార్డు


అవార్డును అందుకుంటున్న దండకారుణ్య ఎడ్యుకేషనల్ వ్యవస్థాపకుడు శ్రీను

అరకులోయ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దండకారుణ్య ఎడ్యుకేషనల్ సొసైటీకి ఉత్తమ అవార్డు దక్కింది. సోమవారం కలెక్టర్ దినేశ్‌కుమార్, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమా ర్, ఐటీడీఏ పీవో శ్రీపూజల నుంచి సొసైటీ వ్యవస్థాపకులు శ్రీను ఈ అవార్డును అందుకున్నా రు.. గంజాయి రహిత సమాజం కోసం ఈగల్ బృందం కలిసి విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నారు. 108 యోగాసనాల కార్యక్రమానికి 200 మంది వలంటీర్లతో చేయించి గుర్తింపు పొందారు. ప్లాస్టిక్ తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ అవార్డు లభించడంపై పలువురు ఆయనను అభినందించారు.

రేషన్ పంపిణీలో సమస్య పరిష్కారానికి వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జీసీసీ ఉద్యోగ సంఘం నేతలు

చింతపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీకి సాంకేతిక సమస్యలు తలెత్తున్నాయని గిరిజన సహకార సంస్థ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బౌడు రామారావు అన్నారు. మంగళవారం జీసీసీ సేల్స్‌మన్, ఉమన్, డీలర్లు, ఎస్‌హెచ్‌జీ డీలర్లు స్థానిక తహసీల్దార్ జి. ఆనందరావుకి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ రేషన్ సరకులు పంపిణీకి నూతన ఈ- పోస్ మిషన్లు పంపిణీ చేసిందన్నారు. అక్టోబరు నుంచి రేషన్ ఆన్‌లైన్ విధానంలో పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ మిషన్లకుసెల్ సాంకేతాలు సక్రమంగా అందక రేషన్ పంపిణీ ముందుకు సాగడంలేదన్నారు. సిగ్నల్స్ లేక వేలిముద్రలు నమోదుకావడంలేదన్నారు. గిరిజన ప్రాంతంలో పూర్తి స్థాయిలో సెల్ సాంకేతాలు అందు బాటులోకి వచ్చే వరకు ఆఫ్‌లైన్ విధానంలో రేషన్ పంపిణీకి అనుమతించాలన్నారు. రేషన్ సరకులు పంపిణీకి ఈనెల 15తో గడువు ముగుస్తుందన్నారు. ఈ స్థితిలో ఏజెన్సీలో ఆఫ్‌లైన్‌లో రేషన్ పంపిణీకి పౌరసరఫరాలశాఖ అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు నెహ్రూబాబు, కార్యదర్శి జె. తరాంబాబు, సేల్స్‌మన్ శెట్టి చిన్నబ్బాయి, కె. రాజు పాల్గొన్నారు.

ఏవోబీలో ముమ్మర వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా- ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లోని జోలాపుట్టు, సంగడ ప్రధాన జంక్షన్ల వద్ద పోలీసులు మంగళవారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఆంధ్రా మీదుగా ఒడిశా వెళుతున్న, వస్తున్న వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులను పోలీసులు విచారించి విడిచి పెడుతున్నారు. అలాగే, మండల కేంద్రంలో రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అనవసరంగా రాత్రి సమయంలో ఎవరూ బయట సంచరించరాదని పోలీసులు స్థానికులను హెచ్చరిస్తున్నారు.

చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాల తొలగింపు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలస చెరువు గట్టుపై అక్రమంగా నిర్మిస్తున్న గృహాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. చెరువు గట్టు ఆక్రమణలపై స్థానిక గిరిజన రైతులు తహసీల్దార్ అన్నాజీరావుకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళవారం అక్రమ కట్టడాలను తొలగించాలని ఆయన ఆదేశించారు. ఈమేరకు రెవెన్యూ ఉద్యోగులు మూడు ఇళ్ల నిర్మాణాలను తొలగించారు. చెరువు గట్టుపై ఎవరు నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

బాలికల వసతి గృహంలో బోరు నిర్మాణం

చింతపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ బాలికల పోస్టు మెట్రిక్ వసతి గృహంలో రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో బోర్‌వెల్ నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. మంగళవారం వసతి గృహ ఆవరణలో బోరు నిర్మాణానికి ఎంపీపీ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు రన్నింగ్ వాటర్ సమస్యతో బాధపడుతున్నారన్నారు. వారి అభ్యర్థన మేరకు తాగునీటి సమస్యకు పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థినులు, హెచ్‌డబ్ల్యూవోలు ఎంపీపీకి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లంబసింగి హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, స్థానిక హెచ్‌డబ్ల్యూవో కె.పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యం పెంపునకు కృషి చేయాలి: ఏసీపీ

చింతపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్ష ఏసీపీ స్వామి నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టీఏఆర్ఎల్ (సరైన స్థాయిలో బోధించడం) శిక్షణ తరగతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన బేస్‌లైన్ పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు ఒకటి, మూడో గ్రూపుల్లో అతితక్కువ మంది ఉన్నారన్నారు. ఇలాంటి వారిలో తగిన విద్యా సామర్థ్యాలను పెంపొందించాలన్నారు. గణితం, తెలుగుల్లో నూతన బోధన పద్ధతులను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పీబీవీవీ ప్రసాద్, ఎంఈవో- 2 గెమ్మెలి బోడం నాయుడు, ఆర్‌పీలు కుడుముల వెంకట రమణ, బి. సంజీవరావు, కె. సంజీవరావు, రాము, దిబ్బ నాయుడు పాల్గొన్నారు.

జి.మాడుగుల: విధాన పరమైన విద్యాబోధనతో విద్యార్థులకు మేలు చేరుకురుతుందని ఏపీసీ డా. స్వామినాయుడు, జిల్లా కో-ఆర్డినేటర్ ఉమాశంకర్ సూచించారు. మండలకేంద్రంలో జరుగుతున్న తర్ల్ శిక్షణ శిబిరంలో ఆయన మంగళవారం సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబూరావుపడాల్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఏసీపీ స్వామినాయుడు

శ్రీనిధి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్


శ్రీనిధి యాప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ

పాడేరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలను మరింత సులభతరం చేసేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూపొందించిన శ్రీనిధి యాప్ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం శ్రీనిధి యాప్ పోస్టర్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, తదితరులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ యాప్ ద్వారా మొబైల్‌తోనే ఆర్థిక లావాదేవీలు మరింత సులభతరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు, గ్రామ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్, శ్రీనిధి జనరల్ మేనేజర్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధానికి కృషి : ఎంపీపీ


కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్‌తో మాట్లాడుతున్న ఎంపీపీలు అనుషదేవి, కుమారి

చింతపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పర్యాటక ప్రాంతాలైన తాజంగి, లంబసింగిల్లో ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్నట్టు ఎంపీపీ కోరాబు అనుషదేవి తెలిపారు. మంగళవారం జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారితో కలిసి పలు సమస్యలను కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కలెక్టర్ పర్యాటక ప్రాంతాల్లో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారన్నారు. ఆయన సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ తెలిపారు. పర్యాటకులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని సందర్శక ప్రాంతాల్లో వినియోగించరాదని, చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయరాదని అవగాహన కల్పిస్తామన్నారు. రాళ్లగెడ్డ- లోతుగెడ్డ ప్రధాన రహదారి, యర్రవరం, దోనుగుమ్ములు జలపాతాలకు రోడ్లు నిర్మించాలని కలెక్టర్‌ను కోరామని తెలిపారు, అలాగే తాజంగి స్వాతంత్ర్య సమయర యోధులు మ్యూజియం ఈ పర్యాటక సీజన్ నాటికి అందుబాటులోకి వస్తుందని కలెక్టర్‌త తెలిపారన్నారు.

పెంకుటి కాలనీ వాసులకు తీరిన కష్టాలు


బ్యాంక్ సమీపంలో నిర్మించిన సీసీ రోడ్డు

ముంచంగిపుట్టు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో పెంకుటికాలనీ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానికులు కష్టాలు తీరాయి. సుమారు 30 ఏళ్లుగా ఆ ప్రాంతంలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలని కాలనీ వాసులు, పరిసర గృహాల వారు అధికారులకు వినతులందించారు. అయినా, ఫలితం కానరాలేదు. సీసీ రోడ్డు సౌకర్యం లేక వర్షం పడితే ఇళ్ల నుంచి బయటకు రాలేని దుస్థితి. అలాగే, ఇదే మార్గంలోఉన్న ఓ పాఠశాలతోపాటు స్టేట్‌బ్యాంక్‌కు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఈ సమస్యలను తీసుకువెళ్లారు. దీంతో ఆమె స్పందించి జడ్పీ నిధులు రూ.15 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో 200 మీటర్ల సీసీ రోడ్డు, 10 మీటర్ల రిటర్నింగ్ వాల్ నిర్మాణం పనులు చేపట్టారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సమస్య పరిష్కరించిన జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు ధన్యవాదాలు తెలిపారు.

కంఠభౌంసుగుడ పాఠశాలకు 'స్వచ్ఛ' పురస్కారం

అరకులోయ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వచ్ఛాంధ్ర అవార్డును కంఠభౌంసుగుడ పాఠశాలకు లభించింది. కలెక్టర్ దినేశ్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం హెచ్ఎం, సిబ్బంది ఈఅవార్డును అందుకున్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత: ఫారెస్టు రేంజర్


మాట్లాడుతున్న ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ

ముంచంగిపుట్టు, అక్టోబరు 7(ఆంధ్ర జ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ముంచంగిపుట్టు ఫారెస్టు రేంజర్ ఎం. మురళీకృష్ణ అన్నారు. మం డలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో మంగళవారం వణ్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. వన్యప్రాణి సంరక్షణ-ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్టు రేంజర్ మాట్లాడుతూ, వన్యప్రాణులకు ఎటువంటి హాని చేయకూడదన్నారు. వాటి మనుగడ వల్ల మనకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అడవులు, ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. ప్రిన్సిపల్ సుమన్, ఫారెస్టు అధికారులు వెంకటరాజు, శ్రీను, రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులు 11 తేదీలోగా రిపోర్టు చేయాలి

చింతపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 11న రిపోర్టు చేయాలని స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ భారతి అన్నారు. వెబ్ ఆప్షన్‌పూర్తయిన వారికి ఈ నెల 10న ఆన్‌లైన్‌లో సీట్లు కేటాయించనున్నట్టు చెప్పారు. విద్యార్థులు 11న కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికేట్స్‌లో హాజరుకావాలన్నారు. కళాశాలలో రిపోర్టు చేయని విద్యార్థుల సీట్లు రద్దవుతాయన్నారు.

సెలవులు ముగిసినా ఇంత తక్కువ మంది హాజరా?

» గోమంగి మినీ గురుకులం సిబ్బందిపై ఎమ్మెల్యే మత్స్యలింగం ఆగ్రహం

పెదబయలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు ముగిసి నాలుగు రోజులవుతున్నా గోమంగి మినీ గురుకులంలో కనీసం పదోవంతు విద్యార్థులు కూడా హాజరు కాకపోవడంపై అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. మొత్తం 207 మంది విద్యార్థులకు గాను కేవలం 13 మంది హాజరవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏటీడబ్ల్యు, డీడీతో మాట్లాడి తక్షణమే విద్యార్థులందరూ పాఠశాలకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే, పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ దండించడంతోనే వారిని పాఠశాలకు పంపించటం లేదని పరిసర గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రిన్సిపాల్‌ను బదిలీ చేస్తేనే తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తామని స్పష్టం చేశారు. దీంతో విద్యార్థులకు ప్రిన్సిపాల్ దండనపై విచారణ చేపట్టడంలో జాప్యం చేయటంపై ఏటీడబ్ల్యు, ఎంఈవోలతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధితులకు పరామర్శ


గురుకులంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

లక్ష్మీపేట పంచాయతీ కోదువలస గ్రామంలో ఇటీవల పిడుగుపడి 20 పశువులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బాధిత రైతులను పరామర్శించారు. ఎమ్మెల్యే సందర్భంగా రైతులకు పరిహారం వివరాలపై నివేదించాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు ఆదేశించారు. పశువుల బాధిత రైతులకు ఒక్కొక్కరికీ రూ. వెయ్యి చొప్పున రూ. 10 వేలు తన సొంత నిధులనుంచి అం దించారు. గ్రామంలో తాగునీటి, రోడ్డు సమస్యలను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి వెళ్లే క్రమంలో మాలగుమ్మిలో మన్యం సంగీత దర్శకుడు రెడ్డి బాలన్న స్టూడియోను సందర్శించారు. ఆయన స్వర పరిచిన పాటలను ఆలకించి అభినందించారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

కొయ్యూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని రచించి ఆదికవి వాల్మీకి మహర్షి గొప్ప చరిత్రను నిక్షిప్తం చేశారని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని వెలగలపాలెంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీ కి మహర్షి సాహితీ రంగంలో ఆయన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు డీవీడీ ప్రసాద్, కిరణ్ మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.


ధారకొండలో వాల్మీకి జయంతి వేడుకలు

సీలేరు: జీకేవీధి మండల ధారకొండ సీతారాముల దేవాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా మడిగుంట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆదికవి రామాయణం రచయిత వాల్మీకి గొప్ప తనాన్ని వివరించారు. అనంతరం ధారకొండ పాఠశాలలో విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ కొర్రా.రాము, గొర్లె. జయరాజు, బరసయ్య, ఏబులం మోహన్ జోరంగి దేవేంద్ర, స్థానికులుపాల్గొన్నారు.

చింతపల్లి: వాల్మీకి మహర్షి సేవలు చిరస్మరణీయమని అమరావతి ఎంఎస్‌యూడీ డిప్యూటీ డైరెక్టర్ పాడి రామారావు అన్నారు. మంగళవారం లంబసింగిలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను పదవీ విరమణ పొందిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ, వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని గిరిజనులు ఐక్యతగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఏటీడబ్ల్యూవో వాలంగి అప్పలనరసయ్య, డీఎంహెచ్‌వో మోదకృష్ణమూ ర్తి, ప్రిన్సిపాల్ వాలంగి నారాయణరావు, బీజేపీ నేత కుడుముల వెంకటరమణ, టీడీపీ నేత దేపూరివెంగళయ్య, ఉద్యోగులు,గ్రామ పెద్దలున్నారు.


వాల్మీకి మహర్షి నివాళి అర్పిస్తున్న బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు


మాట్లాడుతున్న అమరావతి ఎంఎస్‌యూడీ డిప్యూటీ డైరెక్టర్ పాడి రామారావు



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

వాల్మీకి ఆలోచనలు స్ఫూర్తిదాయకం

▸▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి ఆలోచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహర్షి వాల్మీకి భారతీయ సాహిత్యంలో ఆదికవిగా నిలిచారన్నారు. ఆయన రచించిన రామాయణం నిత్య నూతనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణ రావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామాయణం మానవతా విలువలకు స్ఫూర్తి

ఎస్పీ తుహిన్‌సిన్హా



వాల్మీకి చిత్రపటానికి నమస్కరిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మానవతా విలువలకు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం మానవజాతికి మధురమైన మార్గదర్శి కావ్యమన్నారు. యుగాలు గడిచినా సమాజానికి ఆదర్శంగా నిలిచిన విలువలను రామాయణం అందించిందన్నారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అవలంబించుకోవాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దేవప్రసాద్, నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

▸▸ ఆటో డ్రైవర్లకు డీఎస్పీ శ్రావణి హెచ్చరిక

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. మంగళవారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ఆవరణలో ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటార్ వాహన చట్టం నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు. అతి వేగంగా, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ప్రధానంగా ఆటో డ్రైవర్లు సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆటోలో ఎక్కిన ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. ఆటో రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్సు కూడా అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపివేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఎంవీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీఐలు ఎం.వెంకటనారాయణ, టీవీ విజయ్‌కుమార్, అశోక్ కుమార్, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

నర్సీపట్నం-చింతపల్లి మార్గం.. గతుకుల మయం

ప్రమాదకరంగా ఆర్అండ్‌బీ రహదారి

భయాందోళనలో వాహన చోదకులు





ఎక్సైజ్ స్టేషన్ దాటాక ఆర్అండ్‌బీ రోడ్డులో పడిన గొయ్యి... పోలీస్ స్టేషన్ సమీపంలో భారీ గొయ్యి

నర్సీపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం-చింతపల్లి మార్గంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు పడ్డ పెద్ద పెద్ద గోతులు ప్రమాద ఘటికలుగా తయారయ్యాయి. వేగంగా వచ్చే బైక్ పొరపాటున గోతిలో పడితే ప్రాణాపాయం తప్పదని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పోలీసు సబ్ డివిజన్ కార్యాలయ సమీపం, ఎక్సైజ్ స్టేషన్, పోలీస్ స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఇటీవల వర్షాలకు రహదారిలో పెద్ద గోతులు పడ్డాయి. వర్షం నీటితో గోతులు నిండిపోయి ఉండడంతో ఎంత లోతుందో అంచనా వేయడం కూడా కష్టంగా ఉందని వాహనదారులు అంటున్నారు. వీటివల్ల రాత్రి సమయాలలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఆస్కారం ఉందని అంటున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

జోరువానలో హోరాహోరీగా గుర్రపు పందేలు



గుర్రం పరుగు పందెం తిలకిస్తున్న జనం

నాతవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నాతవరంలో నల్లగొండమ్మతల్లి పండగ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి గుర్రం పరుగు పందేలు జోరువానలో ఉత్సాహంగా జరిగాయి. అలాగే గుమ్మిడిగొండలోని నల్లగొండమ్మతల్లి పండగా సందర్భంగా డాన్స్ బేబీ డాన్స్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ సుర్ల వెంకటరమణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు చింతకాయల ప్రశాంత్, మాజీ సర్పంచ్ చింతకాయల నాయుడు తదితరులు గుమ్మిడిగొండలో నల్లగొండమ్మతల్లి జాతరను అట్టహాసంగా నిర్వహించారు. అలాగే తాండవలో కూడా 20 గ్రామాల ప్రజలు నల్లగొండమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ మాధవనగరంలో నల్లగొండమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

కనీస వేతనాలు అమలు చేయాలని ఆశ కార్యకర్తల ఆందోళన

నాతవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆందోళనకు దిగారు. గునుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ బీమా సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం నాయకులు ఎల్.లక్ష్మీ, నాగమణి లక్ష్మీబాయ్ హైమా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

దేవరాపల్లి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ రోడ్డుపై నిర్వహించడంతో ఏర్పడుతున్న ట్రాఫిక్‌కు అంతరాయాన్ని ఎస్ఐ సత్యనారాయణ మంగళవారం క్లియర్ చేశారు. మండలంలోని రైతులు పండించిన కూరగాయలను సోమవారం మినహా మిగతా రోజుల్లో దేవరాపల్లి వనదేవీశ్వర ఆలయం వద్దకు తీసుకు వస్తారు. రైతులు తెచ్చిన కూరగాయలను వ్యాపారస్తులు బలవంతంగా రోడ్డుపై దించడంతో దేవరాపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లే మార్గంలో ప్రయాణం చేయాలంటే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగేది. మార్కెట్‌ను రోడ్డుపై నిర్వహించరాదని వ్యాపారస్థులకు ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డుపై ఉన్న కూరగాయలను వ్యాపారస్థులతో తొలగింపజేశారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

నర్సీపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని నర్సీపట్నం ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఆర్.రామాంజులు అన్నారు. కరక గ్రామంలో మంగళవారం వన్య ప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ వన్య ప్రాణులను వధిస్తే చట్టరీత్యా నేరమని రామాంజులు తెలిపారు. వన్య ప్రాణులను కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందన్నారు. కోటవురట్ల సెక్షన్ అధికారి వివేకనంద ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు.

వన్య ప్రాణులను వేటాడకూడదు



పెడిమికొండ రిజర్వు ఫారెస్టులో వన్య ప్రాణుల వారోత్సవాలు జరుపుతున్న అధికారులు

నాతవరం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణులను సంరక్షణపై మంగళవారం పెడిమికొండ రిజర్వు పారెస్టు పరిధిలోని గిరిజనులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారి చిరంజీవి మాట్లాడుతూ వన్య ప్రాణులను ఎవ్వరూ వేటఆడవద్దని సూచించారు. అలాగే అందరూ వన్య ప్రాణుల సంరక్షణ చట్టాల గురించి తెలుసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు నాగరాజు మహంతి, పి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో పునర్జీవులు కండి

అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి

నర్సీపట్నం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం చేసి పునర్జీవులు కావాలని అఖిల భారత శరీర, అవయవ దాత సంఘం అధ్యక్షురాలు డాక్టర్ గూడురూ సీతామహాలక్ష్మి కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందరర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రైన్ డెడ్ అయిన వారు అవయవ దానం చేస్తే నలుగురికి ప్రాణ దానం చేయవచ్చన్నారు. దాత అవయవాలు సకాలంలో తరలించడానికి ప్రభుత్వం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేస్తుందన్నారు. అవయవ దానం చేసి మానవీయ సమాజం నిర్మించాలని కోరారు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీ పద్మావతి, లయన్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ దస్త్రాల రాఘవేంద్రరావు, అధ్యక్షుడు కె.సతీశ్, ట్రెజరర్ బీఎస్ఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'ఈకేవైసీ చేయించుకోకపోతే ఉపాధి పనులు ఉండవు'



చమ్మచింతలో ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ చేయిస్తున్న అధికారులు

నాతవరం అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకోకపోతే గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఉండవని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కొండాజీ తెలిపారు. మండంలోని చమ్మచింత గ్రామంలో మంగళవారం ఉపాధి పథకం కూలీలతో ఈకేవైసీ చేయించారు. ఈ సందర్భంగా కొండాజీ మాట్లాడుతూ నాతవరం మండలంలో 28059 మందికి ఈకేవైసీ చేయించాల్సి ఉందని చెప్పారు. ఇప్పటి వరకు పది వేల మంది ఈకెవైసీ అప్‌డేట్ చేయించుకున్నారని తెలిపారు. ఆధార్ అనుసంధానంతో ఎన్ఎంఎం మొబైల్ యాప్‌లో ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. తద్వారా ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న శ్రామీకులందరికి ముఖస్కాన్‌లు తీసి డేటా అప్‌లోడ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ

నర్సీపట్నం, అక్టోబబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు సీబీఎం కాంపౌండ్ చర్చి స్థలాల వివాదంపై తహసీల్దార్ రామారావు విచారణ చేశారు. మంగళవారం సర్వేయర్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ నాయుడు, వీఆర్వో కుమార్‌తో ఆయన సీబీఎం కాంపౌండ్ ఆవరణ వద్దకు వచ్చారు. అక్కడ ఫిర్యాదుదారు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత డాక్యుమెంట్లు అందజేయాలని సూచించారు.

దేవరాపల్లి పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీడీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్

దేవరాపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోపాక చంద్రశేఖర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మారేపల్లి, కొత్తపల్లి శివారు సంజీవపురం గ్రామాలతో పాటు దేవరాపల్లి పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. పశువైద్య కేంద్రంలో అందుతున్న సేవలు గురించి వైద్యాధికారి జి.గాయత్రిదేవీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీఆర్‌డీఏ ద్వారా 1500 మంది డ్వాక్రా మహిళలకు పశువులు కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులు 2000 మంది రైతులకు ఇవ్వడానికి లక్ష్యంగా పెటుకున్నామన్నారు. దీని ద్వారా రైతుకు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతందన్నారు. పశువైద్యాధికారి గాయత్రీ దేవీ, మంజుషారాణి, జి.ప్రియాంక, సిబ్బంది సురేషు పాల్గొన్నారు.

బుచ్చెంపేట వార్డు కార్యదర్శి ఉదారత

▸▸ సొంత నిధులతో డ్రైనేజీ నిర్మాణం



సొంత నిధులతో బుచ్చెంపేటలో డ్రైనేజీని ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రోలుగుంట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట పెద్దన్నయ్య సెంటర్ వీధిలో డ్రైనేజీని వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ సొంత నిధులతో నిర్మిస్తున్నారు. మురుగునీరు పోయేందుకు అవకాశం లేక ప్రజలు పడుతున్న విషయాన్ని గుర్తించిన ఆయన మంగళవారం ఆ వీధిలో డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీని నిర్మాణంలో గ్రామంలో సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తన సొంత నిధులు వెచ్చించి పూర్తి స్థాయిలో శాశ్వత డ్రైనేజీని ఏర్పాటు చేస్తున్న రమణను గ్రామస్థులు అభినందించారు.

ఘనంగా మోదకొండమ్మ ఆలయంలో పూజలు

మాడుగుల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. స్థానిక, స్థానికేతర భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు.

జీఎస్‌టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీలు



చోడవరంలో జీఎస్‌టీపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



మాడుగులలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చోడవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ 2.0పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్‌టీ 2.0 మార్పులతో ప్రజలకు కలిగే లాభాల గురించి విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, కామర్స్ హెచ్‌వోడీ వి. అప్పలనాయుడు, బిచ్చమ్మ, శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి, సుధీర్ ఇతర లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాడుగులలో..

నిత్యావసర సరుకులతో పాటు అన్ని రకాల వాటిపై జీఎస్టీని తగ్గించడంతో ప్రజలకు ఎంతో ఆదా అవుతుందని మాడుగుల ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో టీడీపీ మండల అధ్యక్షుడు నందారపు సన్యాసిరావు ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో తగ్గిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన సదస్సుని నిర్వహించారు.

బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి తగ్గిన జీఎస్టీపై నినాదాలు చేశారు. అనంతరం పట్టణంలో ఉన్న ప్రతి షాపు వద్దకు ర్యాలీగా వెళ్లి వ్యాపారులకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి పుప్పాల రమేశ్, బీజేపీ నాయకులు పుట్టా గంగయ్య, వడ్డాది వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం గొల్లపేట గ్రామస్థుల నిరసన



రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన చేపడుతున్న గొల్లపేట గ్రామస్థులు

రోలుగుంట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకం ద్వారా మంచినీటి సరఫరా చేయపట్టాలని కోరుతూ మంగళవారం ఎస్.కొత్తూరు పంచాయతీ శివారు గొల్లపేట గ్రామస్థులు రోడ్డుపై బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లపేటలో 50 కుటుంబాలకు చెందిన 250 మంది జనాభా నివస్తున్నామన్నారు. 2023-24 సంవత్సరంలో జలజీవన్ మిషన్ కింద రూ.22 లక్షలు ఖర్చు చేసి 10 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, బోర్‌వెల్, ఇంటింటికీ కొళాయిలను ఏర్పాటు చేశారన్నారు. కానీ నీటి సరఫరా చేయడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మా గ్రామాన్ని ఫ్లోరైడ్ గ్రామంగా గుర్తించారని, ఇక్కడ నీటిని తాగితే ఫ్లోరైడ్ బారిన పడుతున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. వారం రోజుల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలని, లేకుంటే బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, గ్రామస్థులు సత్యవతి, మెలిం అచ్చియ్యమ్మ, చందక రాజుబాబు పాల్గొన్నారు.

పార్కులో కూలిన సెప్టిక్ ట్యాంకు గోడ



పడిపోయిన సెప్టిక్ ట్యాంక్ గోడ

దేవరాపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్కులో మరుగుదొడ్డి కోసం నిర్మిస్తున్న సెప్టిక్ గోడ కొంతవరకు వర్షానికి కూలిపోయింది. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీఎంఆర్డీఏ రూ.50లక్షలతో చేపట్టిన ఈ పనులులో భాగంగా సెప్టిక్ ట్యాంకు కోసం కట్టిన గోడ కొంతవరకు పడిపోయింది. ఈ విషయమై ఇంజనీరింగ్ అధికారులను వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులో లేరు.


పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



మృతిచెందిన పాడిఆవు వద్ద రోదిస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు పాడి ఆవు అక్కడికక్కడే మృతి చెందగా.. రైతుకు ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఆర్.భీమవరం గ్రామానికి చెందిన రైతు రొంగలి చిన్నంనాయుడు మంగళవారం మధ్యాహ్నం పాడి ఆవుని పొలాల్లో మేపునకు తీసుకు వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఆరంభమైంది. ఆ సమయంలో ఒక పిడుగు పాడి ఆవుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవుని స్థానిక పశు వైద్యాధికారి పరిశీలించారు. అనంతరం ఆవుకి స్థానికులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆవును 70వేల రూపాయలకు కొనుగోలు చేసినట్టు బాధిత రైతు చిన్నంనాయుడు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పాడిరైతుని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ మలిరెడ్డి బాబ్జి కోరారు.

నేడు రాయపురాజుపేటలో దుర్గాలమ్మ పునఃప్రతిష్ఠ



చోడవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపురాజుపేటలో ఈనెల 8వ తేదీన దుర్గాలమ్మ ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్ తెలిపారు. సోమవారం ఉదయం నుంచి ఆలయ ప్రతిష్ఠాపనకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, బుధవారం ఉదయం 9 గంటల 14 నిమిషాలకు అమ్మవారి ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని గంగాధర్ కోరారు.

భమిడిపాటి సత్రం భూముల కౌలువేలం రేపు

చోడవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీన స్థానిక భమిడిపాటి సత్రంకు చెందిన జన్నవరంలోని భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు దేవదాయ శాఖ ఈవో ఎస్‌వీ. సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక హార్డింజి అతిథిగృహం వద్ద భమిడిపాటి సత్రంకు చెందిన భూములకు కౌలు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల రైతులు ఈ వేలంలో పాల్గొనాలని ఈవో సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ కోటేశ్వరరావు

రావికమతం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొత్తకోట సీఐ జి. కోటేశ్వరరావు అన్నారు. కొత్తకోట సర్కిల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం శ్రీశాంతి ఆటో యూనియన్ సభ్యులతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రైవింగ్ చేసే సమయంలో ఇతర వాహనదారులను రాకపోకలను అప్రమత్తంగా గమనించాలన్నారు. వేగం కంటే ప్రాణం గొప్పదనే విషయాన్ని వాహనదారులు ఎప్పుడు గ్రహించాలన్నారు. సభలు, సమావేశాలకు ప్రయాణికులను ఆటోపై తరలించేందుకు పోలీసు శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడికి సీపీఎం నిరసన

బుచ్చెయ్యపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడికి యత్నించడాన్ని ఖండిస్తూ రాజాం గ్రామంలో సీపీఎం కార్యకర్తలు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీజేఐ గవాయ్‌పై దాడికి పాల్పడడం హేయమైనదన్నారు. కార్యక్రమంలో శ్రీను, ముత్యాలు, మరియమ్మ, అమ్మోజి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చీడికాడ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం బీవీ.రమణ మాట్లాడుతూ, పోటీలో విజేతలకు బహుమతులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో డ్రోన్లు



పంటలకు పురుగు నివారణ మందును పిచికారీ చేసే డ్రోన్

పురుగు మందులు, ద్రవ ఎరువుల పిచికారీకి వినియోగం

- ఎకరా విస్తీర్ణంలో పది నిమిషాల్లో పని పూర్తి
- ప్రతి మొక్కకూ సమానంగా మందు
- సమయంతోపాటు కూలి ఖర్చులు ఆదా
- డ్రోన్ ఖరీదుపై 40 శాతం రాయితీ ఇస్తున్న ప్రభుత్వం
- 50 శాతం బ్యాంకు నుంచి రుణ సదుపాయం
- డ్రోన్ల వినియోగంపై వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శిక్షణ



రాంబిల్లిలో వరి పైరుకు డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేయడాన్ని చూపిస్తున్న బీసీటీ కేవీకే యంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంతగౌడ, ఇతర శాస్త్రవేత్తలు

రాంబిల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇతర రంగాల్లో మాదిరిగానే వ్యవసాయ రంగంలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరుగుతున్నది. ఇందులో భాగంగా పురుగు మందుల పిచికారీ, ద్రవ రూపంలో వుండే రసాయన, జీవన ఎరువులను చల్లడానికి డ్రోన్లను వాడుతున్నారు. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులు, ఎరువులను వేసుకోవచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంతగౌడ చెబుతున్నారు. భవిష్యత్తులో డ్రోన్ టెక్నాలజీతో భారత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆయన అంటున్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

పొలాల్లో పనులు చేసే కూలీల సంఖ్య రానురాను తగ్గిపోతున్న. దీనివల్ల కూలి రేట్లు పెరిగిపోయి పంట సాగు వ్యయం అధికం అవుతున్నది. దీనివల్ల రైతులకు ఆర్థికంగా భారం పడుతున్నది. విత్తనాలు/ వరినాట్లు వేయడం, కలుపుతీత, పంట కోత, నూర్పిడి వంటి పనులు చేయడానికి ఇప్పటికే యంత్రాలను వినియోగిస్తున్నార. ఇప్పుడు పురుగు మందుల పిచికారీ, రసాయన/ జీవన ఎరువులు పిచికారీ చేయడానికి డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో వీటిని పిచికారీ చేయవచ్చు. పైగా పొలం అంతటా ఒకే రీతిలో మందు పిచికారీ అవుతుంది. పది లీటర్ల మందు నీరు పట్టే ట్యాంకు వున్న డ్రోన్ సాయంతో ఒక ఎకరా విస్తీర్ణంలో గరిష్ఠంగా పది నిమిషాల్లో పిచికారీ చేయవచ్చు. కూలీలతో మందును పిచికారీ చేయించే సమయంతో పోలిస్తే ఇది నాలుగు శాతమే! మొత్తంగా 96 శాతం సమయం, 90 శాతం నీటిని ఆదా చేస్తాయి. అంతేకాక మొక్కల అన్ని భాగాలకు సమానంగా మందు తగులుతుంది. తద్వారా తెగుళ్లు త్వరగా నియంత్రణ అవుతాయి. దీనివల్ల పురుగు మందుల ఖర్చులు తగ్గి, ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుంది. వరి, చెరకు, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు డ్రోన్లతో మందులను పిచికారీ చేయవచ్చు. కొండవాలు ప్రదేశాల్లో (టెర్రస్ ఫార్మింగ్) పంటలు సాగు చేసే ఏజెన్సీ ప్రాంతంలో డ్రోన్ల వినియోగం మంచి ఫలితాలను ఇస్తుంది. డ్రోన్లతో పురుగు మందులను పిచికారీ చేయడం వల్ల రైతులపై మందుల ప్రభావం ఒక్క శాతం కూడా పడదు.

డ్రోన్‌లపై 40 శాతం సబ్సిడీ

వ్యవసాయ రంగంలో వినియోగించే డ్రోన్ల ఖరీదు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వుంటుంది. ఐదుగురు రైతులను ఒక బృందంగా ఏర్పడి, వ్యవసాయ శాఖ కార్యాలయం/ రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొని డ్రోన్ కొనుగోలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తుంది. బ్యాంకుల నుంచి 50 శాతం రుణం అందిస్తారు. మిగిలిన 10 శాతం ఖర్చును మాత్రమే రైతులు చెల్లించాల్సి వుంటుంది. డ్రోన్ల నిర్వహణ, వినియోగంపై గుంటూరులోని డాక్టర్ ఎన్టీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లేదా అమరావతిలో 12 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారు. మరింత సమాచారం కోసం 84311 05162 (శ్రీకాంతగౌడ) నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

క్రైం... crime news

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి



మృతిచెందిన అశోక్

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్మన్‌పేట వద్ద సోమవారం సముద్రంలో గల్లంతైన పాలిటెక్నిక్ విద్యార్థి పోలుపర్తి అశోక్ (19) మృతిచెందాడు. కొర్లయ్యపేట సముద్రతీరంలో మంగళవారం మృతదేహం లభ్యమైంది. కోటవురట్ల మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన అశోక్, అతని స్నేహితులు కలిసి సోమవారం పాల్మన్‌పేట సముద్రతీరానికి వచ్చి నీటిలో గల్లంతైన సంగతి తెలిసిందే. పోలీసులు గజ ఈతగాళ్లతో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం కొర్లయ్యపేట సముద్ర తీరంలో మృతదేహం కనిపించినట్టు స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి అశోక్‌గా గుర్తించి, నక్కపల్లి సీహెచ్‌సీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కోటవురట్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గత నెల మూడో వారంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ రమేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రోలుగుంట మండలం కొమరవోలు గ్రామానికి చెందిన కోడి ప్రసాద్ (35) వృత్తిరీత్యా సంగీత కళాకారుడు. గత నెల 20వ తేదీన ద్విచక్ర వాహనంపై ఎస్‌రాయవరం వెళ్లాడు. అక్కడ కార్యక్రమం ముగిసిన తరువాత ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం అయ్యాడు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో కోటవురట్ల మండలం జల్లూరు యండపల్లి బ్రిడ్జి దాటిన తర్వాత అడ్డుగా వచ్చిన కుక్కకు తప్పించే క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. ఇతని తల్లి పెద్దబుల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రత్యేక రైళ్లకు పెరుగుతున్న ఆదరణ

- అనకాపల్లి- సికింద్రాబాద్ రైలులో బెర్త్‌లన్నీ ఫుల్



రిజర్వేషన్ బోగీలో మహిళా ప్రయాణికులు



జనరల్ బోగీలో ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే అధికారులు అనకాపల్లి నుంచి సికింద్రాబాద్, తిరుపతిలకు ప్రవేశపెట్టిన ప్రత్యేక రైళ్లకు ఆదరణ పెరుగుతున్నది. 07059 నంబరుతో సోమవారం సికింద్రాబాద్‌లో బయలుదేరిన ప్రత్యేక రైలు మంగళవారం ఉదయం అనకాపల్లి చేరుకుంది. తిరిగి 07060 నంబరుతో మంగళవారం సాయంత్రం 5.35 గంటలకు అనకాపల్లి నుంచి సికింద్రాబాద్‌కు బయలుదేరింది. ఈ రైలులో తొమ్మిది ఏసీ బోగీలు, ఆరు స్లీపర్ క్లాస్ బోగీలు, నాలుగు జనరల్ బోగీలతోపాటు దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక బోగీ వున్నాయి. అన్ని శ్రేణుల బోగీల్లో బెర్త్‌లన్నీ నిండడంతోపాటు 50 వరకు వెయిటింగ్ లిస్టు వున్న వున్నట్టు స్థానిక స్టేషన్ అధికారులు చెప్పారు. అనకాపల్లి, చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా లంకెలపాలెం, కూర్మన్నపాలెం, గాజువాకల నుంచి పలువురు ప్రయాణికుల్లో ఈ రైల్లో వెళ్లడానికి రిజర్వేషన్ చేయించుకున్నారు. ఈ రైలు ఎలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి మీదుగా బుధవారం ఉదయం 8.40 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని స్టేషన్ మేనేజర్ నచ్చి నివాస్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టులో దార్లపూడి బాలికలకు చోటు

ఎస్.రాయవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మండలంలోని దార్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు జిలుగుల తారకలక్ష్మి, పినపోలు భార్గవి చక్కని ప్రతిభ కనబరిచారు. దీంతో త్వరలో చిత్తూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎం జాన్, పీడీ నిర్మల, సోమేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

- వరి పైరుపై పలు రకాల తెగుళ్లు
- సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి అగ్రికల్చర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. ఆర్ఏఆర్ఎస్‌లో మంగళవారం జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పైరును పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సిఫారసు మేరకు ఎరువులు వేసుకొని, గట్లపై కలుపు తీసేయాలని చెప్పారు. పొడతెగులు కనిపిస్తే లీటరు నీటికి రెండు మి.మీ.ల హెక్సాకోనజోల్ లేదా ఒక మి.మీ. ప్రొపికోనజోల్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరి పైరుకు అగ్గితెగులు సోకినట్టయితే లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.మీ.ల ఐసోప్రోథయోలిన్ కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. వరిలో సుడిదోమ నివారణ కోసం లీటరు నీటికి 1.5 గ్రాముల అసిఫేట్ కలిపి పిచికారీ చేయాలని, దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్టయితే లీటరు నీటికి 0.6 గ్రాముల పైమెట్రోజోన్ లేదా 0.4 గ్రాముల డైనోటెఫ్యూరాన్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. క్లోరాంతనిలిప్రోల్ గుళికలు ఎకరానికి నాలుగు కిలోల చొప్పున యూరియాతోపాటు బురద పదునులో వేసుకుంటే కాండం తొలుచు పురుగును నివారించవచ్చునన్నారు. దుబ్బు చేసే దశలో ఉన్న వరి పైరులో పొటాష్ లోపం ఎక్కువగా కనిపిస్తున్నదని, ఆఖరి దమ్ములో పొటాష్ వేయనట్టయితే దుబ్బు చేసే దశలో రెండో దఫా యూరియాతోపాటు ఎకరాకు 17 కిలోల మ్యురేట్ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలన్నారు. అంకురం దశలో ఉన్న వరి పైరుకు మూడో దఫా ఎకరాకు 25 కిలోల యూరియాను, 17 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను బురద పదును చూసుకుని సమానంగా చల్లాలని చెప్పారు.

కంది పంటలో రసం పీల్చు పురుగుల నివారణ కోసం లీటరు నీటికి 2 మి.మీ.ల చొప్పున డైమిథోయేట్‌ను కలిపి పిచికారీ చేయాలని ఏడీఆర్ సూచించారు. చెరకులో మొవ్వ కుళ్లు తెగులు నివారణ కోసం లీటరు నీటకి ఒక గ్రాము కార్బెండిజమ్ లేదా మూడు గ్రాముల మాంకోజెబ్ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరి, ఆర్.సరిత, సిహెచ్.రామలక్ష్మి, వి.చంద్రశేఖర్ ఎ.అలివేణి పాల్గొన్నారు.

యువతకు విదేశాల్లో ఉద్యోగ, విద్య అవకాశాలు

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగాలు, ఉన్నత విద్యను అభ్యసించడానికి అవకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఖతార్ దేశంలోని దోహా నగరంలో హోమ్ కేర్ నర్సు (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 నుంచి 40 ఏళ్ల లోపు వారై వుండి, బీఎస్సీ లేదా జీఎన్ఎం నర్సింగ్ విద్యార్హత కలిగి, కనీసం రెండు సంవత్సరాల పని అనుభవం ఉండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.1,20,000 (భారతీయ కరెన్సీలో) వరకు పన్ను రహిత వేతనంతోపాటు ఉచిత వసతి, వైద్యం, రవాణా సదుపాయాలు వుంటాయని తెలిపారు. ఈ నెల 13వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

ఐరోపాలోని జర్మనీ దేశంలో ఫిజియోథెరపీ, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ ఉద్యోగాలు ఉన్నాయని ఆయన తెలిపారు. బీపీటీ/ ఎంపీటీ, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీలో డిప్లొమా/ డిగ్రీ విద్యార్హత అవసరమని, ఫ్రెషర్స్‌కు నెలకు 2,500 నుంచి 3,000 యూరోల వరకు వేతనం లభిస్తుందని చెప్పారు. భారత్ కరెన్సీలో రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వుంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా జర్మన్ లాంగ్వేజ్ ట్రైనింగ్ పొందవలసి ఉంటుందని, దీనికి రూ.లక్ష ఫీజు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయసువారు అర్హులని తెలిపారు.

రష్యాలో మెటలర్జీ కోర్సు

రష్యా దేశంలోని పర్వూరల్స్కి మెటలర్జికల్ కాలేజీలో మెటలర్జీ కోర్సులో స్కాలర్‌షిప్ ద్వారా చేరడానికి అర్హులైన యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గోవిందరావు తెలిపారు. ఈ కోర్సు వ్యవధి మూడు సంవత్సరాల ఆరు నెలలు కాగా, 18 నుంచి 21 సంవత్సరాల మధ్య వారు అర్హులని పేర్కొన్నారు. ఇంగ్లిషు పరీక్షలో కనీసం 75 శాతం మార్కులు సాధించి, అనర్గళంగా ఇంగ్లిషు మాట్లాడాలని చెప్పారు. ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు, వసతి ఉచిత కల్పిస్తారని తెలిపారు. ఈ కోర్సులో చేరాలనుకునేవారు ఈ నెల 13వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పాస్‌పోర్టు, విద్యా సంబంధ ధ్రువపత్రాలు, అనుభవ పత్రాలతో కలిపి సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 83095 61123, 99888 53335 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని గోవిందరావు తెలిపారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో శేషు రిషిత్‌కు కాంస్య పతకం



శేషు రిషిత్‌రెడ్డి

కాకినాడ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఇటీవల జరిగిన సీబీఎస్ఈ జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో సెబర్ సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో కాకినాడ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థి నల్లమిల్లి శేషు రిషిత్‌రెడ్డి కాంస్య పతకం సాధించినట్టు స్కూలు అధినేత డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి తెలిపారు. ఫెన్సింగ్ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజీవ్‌మెహతా మాట్లాడుతూ సీబీఎస్ఈ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో మొదటిసారిగా ఆంధ్ర నుంచి క్రీడాకారులు మంచి పోటీ ఇచ్చారన్నారు. విజేత శేషరిషిత్‌ను, ప్రిన్సిపాల్ వందనా బొహరాను, శిక్షకులు సతీష్, బేబీరెడ్డిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఎన్.సుగుణారెడ్డి అభినందించారు.

బాల్య వివాహ ప్రయత్నాన్ని అడ్డుకున్న అధికారులు

- పెళ్లి కొడుకు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన ఐసీడీఎస్, చైల్డ్ వెల్ఫేర్ ప్రతినిధులు



బాల్య వివాహం చేయబోమని అంగీకార పత్రం తీసుకుంటున్న అధికారులు

రావికమతం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ఐసీడీఎస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన యువకుడికి, అగనంపూడి గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికతో పెళ్లి నిశ్చయమైంది. ఇటీవల ఇరు కుటుంబాల వారు నిశ్చితార్థం కూడా జరిపించారు. త్వరలో పెళ్లి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో బాలికకు వివాహం చేస్తున్నారన్న సమాచారం చైల్డ్ వెల్ఫేర్ సిబ్బందికి అందింది. ఆ సంస్థ ప్రతినిధి అంబేడ్కర్, సీడీపీవో మంగతాయారు, సూపర్‌వైజర్ ఉన్నిసా బేగం, మహిళా పోలీస్ నూకరత్నం, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి కొత్తకోటలోని పెళ్లి కొడుకు ఇంటికి మంగళవారం వెళ్లారు. ఈ బాల్య వివాహ ప్రయత్నం విరమించుకోవాలని, లేకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించడంతో పాటు బాల్య వివాహం వలన జరిగే అనర్థాలను వారికి వివరించారు. బాలిక మేజరు అయ్యేంత వరకు పెళ్లి వాయిదా వేసుకోవాలని పెళ్లి కొడుకు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే బాల్య వివాహం చేయబోమని వారి నుంచి అంగీకార పత్రం తీసుకున్నారు.

9 నుంచి స్కూల్స్ గేమ్స్ జట్ల ఎంపిక

విశాఖపట్నం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్కూల్స్ గేమ్స్ అండర్-19కు జట్లను ఎంపిక చేస్తున్నామని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి పి.ఉమారాణి తెలిపారు. ఈనెల 9న గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, 10న నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాకీ, 13న నగరంలోని బీవీకే కళాశాలలో బాస్కెట్‌బాల్, కోకో, 14న శ్రీకృష్ణాపురంలో జిమ్నాస్టిక్స్, కలరియపాయట్టు, 15న అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్, 17న పరవాడ ఎస్‌పీఎస్ కళాశాలలో కబడ్డీ, యోగా, చెస్, 18న చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాలీబాల్, 19న శ్రీకృష్ణాపురంలో హ్యాండ్‌బాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడలకు జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. విద్యార్థులు 2007 తర్వాత పుట్టిన వారై, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు మాత్రమే హాజరుకావాలన్నారు. వయసు ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, పాన్ నంబరుతో పాటు క్రీడా సామగ్రి, క్రీడా దుస్తులతో హాజరుకావాలన్నారు. ఓపెన్‌స్కూల్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంపికలకు అనర్హులన్నారు. ఆసక్తిగల వారు ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలలోగా క్రీడా ప్రాంగణాలకు చేరుకోవాలని, వివరాలకు 94408 85898, 99669 31556, 98854 73808 నంబర్లలో సంప్రదించాలన్నారు.

భారీ వర్షం

... 5వ పేజీ తరువాయి

వీచడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుచ్చెయ్యపేట మండలం ఆర్.బీమవరంలో సాయంత్రం వర్షంతోపాటు పిడుగులు పడడంతో రొంగలి చిన్నంనాయుడుకు చెందిన ఆవు మృతిచెందింది. సమీపంలోని పాకలో వున్న ఆయన క్షేమంగా బయటపడ్డారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో మంగళవారం భారీ వర్షం పడింది. మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఆకాశంలో మేఘాలు కమ్మి సుమారు గంటపాటు వర్షం పడింది. మెయిన్‌రోడ్డులో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు కాలనీల్లో రోడ్లపై నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. స్కూళ్లు వదిలిపెట్టే సమయం కావడంతో పలువురు విద్యార్థులు తడుచుకుంటూనే ఇళ్లకు చేరారు.



చోడవరంలో వాగును తలపిస్తున్న పీడీకాడ రోడ్డు



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు వేచి ఉండే స్థలంలో చేరిన వర్షం నీరు

ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

ద్వారా ఏ ప్రాంతం నుంచి, ఎంత ధాన్యం వస్తుందో ముందుగానే అంచనా వేసి సేకరణ జరుపుతారు. జిల్లాను 63 క్లస్టర్లుగా విభజించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు ఇప్పటికే అంచనాకు వచ్చారు. ధాన్యం నాణ్యత, తేమ శాతంపై కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కంప్యూటర్లు, గోనె సంచులు, తూనిక యంత్రాలు, తేమ శాతం కొలిచే పరికరాలను అందుబాటులో వుంచుతారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529